www.prajanaava.in
Telugu Daily

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 08 | వెల : 5.00

Published from: Karimnagar, Circulated to: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

హైదరాబాద్ | సంపుటి :2 | సంచిక : 42 | శుక్రవారం | 26 జూలై 2024



ఆర్చరీలో అదరహా

8 లో..



# బడ్జెట్



# ₹ 2,91,159 కోట్లు

## అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టిన భట్టి విక్రమార్క

## ఆర్థిక లోటు నుంచి కోలుకునే దిశగా అడుగులు

## వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తూ కేటాయింపులు

| | |
|---|---|
| ఆర్థిక లోటు అంచనా | రూ.49,255.41 కోట్లు |
| ప్రాథమిక లోటు అంచనా | రూ.31,525.63 కోట్లు |
| రెవెన్యూ మిగులు అంచనా | రూ.297.42 కోట్లు |
| వ్యవసాయానికి | రూ.72,659 కోట్లు |
| ఉద్యానశాఖకు | రూ.737కోట్లు |
| పశుసంవర్ధశాఖకు | రూ.1,980కోట్లు |
| రూ.500 గ్యాస్ సిలిండర్ | రూ.723 కోట్లు |
| గృహజ్యోతికి | రూ.2,418కోట్లు |
| ప్రజాపంపిణీ వ్యవస్థకు | రూ.3836కోట్లు |
| పంచాయతీరాజ్, గ్రామణాభివృద్ధిశాఖకు | రూ.29,816 కోట్లు |
| రీజినల్ రింగ్ రోడ్డుకు | రూ.1,525 కోట్లు |
| స్త్రీ, శిశు సంక్షేమానికి | రూ. 2,736 కోట్లు |
| ఎస్సీ సంక్షేమం | రూ.33,124కోట్లు |
| ఎస్టీ సంక్షేమం | రూ.17,056కోట్లు |
| మైనార్టీ సంక్షేమం | రూ.3,003కోట్లు |
| బీసీ సంక్షేమం | రూ.9,200 కోట్లు |
| వైద్య, ఆరోగ్యం | రూ. 11,468 కోట్లు |
| ట్రాన్స్‌కో, డిస్కంలకు | రూ.16,410 కోట్లు |
| అడవులు, పర్యావరణం | రూ.1,064 కోట్లు |
| పరిశ్రమల శాఖకు | రూ. 2,762 కోట్లు |
| ఐటీ శాఖకు | రూ.774 కోట్లు |
| నీటిపారుదల రంగానికి | రూ.22,301 కోట్లు |
| విద్యకు | రూ.21,292 కోట్లు |
| హెూంశాఖకు | రూ.9,564కోట్లు |
| రోడ్లు, భవనాల శాఖకు | రూ.5,790 కోట్లు |

**హైదరాబాద్ బ్యూరో, ప్రజానావ:**

అభివృద్ధి, సంక్షేమ రంగాలను పరుగు పెట్టించేలా..వ్యవసాయాన్ని గాడిలో పెట్టించేలా...అనేక రంగాలను భ్రష్టు పట్టించి, అప్పులు చేసిన తెలంగాణను తలెత్తుకునేలా చేసేలా...కాంగ్రెస్ ప్రభుత్వం తన తొలి వార్షిక బడ్జెట్‌ను గురువారం అసెంబ్లీకి సమర్పించింది. గత బిఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణను అన్ని రంగాల్లో దివాళా తీయించిన క్రమంలో మళ్లీ పట్టాలకు ఎక్కించేలా ప్రభుత్వం పూనుకుందని చెబుతూ ఆర్థికమంత్రి మల్లు భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రవేశ పెట్టారు. మండలిలో మంత్రి శ్రీదర్ బాబు బడ్జెట్ ప్రవేశ పెట్టారు. ఎన్నికలు ముగిసి, కేంద్ర బడ్జెట్ ప్రవేశ పెట్టిన తరవాత.. కేటాయింపులు ఏవీ లేకపోయిన సమయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఆరుగ్యారెంటీల అమలు, ఇచ్చిన హావిరీలు పూర్తి చేయడం, అన్నిరంగాల్లో తెలంగాణను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రకటిస్తూ..డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క శాసనసభలో పూర్తిస్థాయి పద్దును ప్రవేశపెట్టారు. రూ.2,91,159కోట్లతో బడ్జెట్‌ను సభ ముందుకు తీసుకొస్తున్నట్లు మంత్రి తెలిపారు. దీనిలో మూలధన వ్యయం రూ.33,487 కోట్లుగా చెప్పారు. పన్ను ఆదాయం 1,38,181.26 కోట్లు, పన్నేతర ఆదాయం రూ.35,208.44 కోట్లు, కేంద్ర పన్నుల్లో వాటా 26.216.28 కోట్లు, కేంద్రం గ్రాంట్లు 21,636.15 కోట్లుగా పేర్కొన్నారు. ఈ ఏడాది రూ.57,112 కోట్ల అప్పులు తీసుకోవాలని ప్రతిపాదించారు. నిజాం షుగర్స్‌ను తిరిగి ప్రారంభిస్తామని భట్టి విక్రమార్క తన బడ్జెట్ ప్రసంగంలో చెప్పారు. తెలంగాణ బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికే సింహభాగం ప్రకటించారు. 72,659 కోట్లు కేటాయించినట్లు ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఇది రైతుల తలరాతలు మార్చే చరిత్రాత్మక నిర్ణయమన్నారు. దేశ చరిత్రలో వ్యవసాయరంగానికి ఇది ఒక మైలురాయి అని తన ప్రసంగంలో పేర్కొన్నారు. రైతు భరోసా సహా ఇచ్చిన హావిరీలన్నీ అమలు చేసి తీరుతామని, బడ్జెట్‌అంటే.. కేవలం అంకెల సమాహారం కాదు. విలువలు, ఆశల వ్యక్తీకరణ కూడా అంటూ ప్రకటించారు. జిల్లాల మధ్య ఆదాయ అంతరాలు తగ్గించేందుకు చర్యలు తీసుకుంటాం. అసమానతలు లేని సమ-సమాజ స్థాపన దిశగా అడుగులు వేస్తున్నాం. ఈ ఏడాదిలోనే రైతు కూలీలకు రూ.12వేలు అందించే బృహత్తర కార్యక్రమం చేపడతాం అని అన్నారు. పీఎం ఫసల్ బీమా యోజనలో చేరాలని నిర్ణయించాం. రైతులు చెల్లించాల్సిన బీమా ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుంది. పైసా ఖర్చు లేకుండా పంటలకు పూర్తి భద్రత కల్పిస్తాం. వరి రైతులకు క్వింటాకు రూ.500 బోనస్ ఇవ్వాలని నిర్ణయించాం. ఆయిల్‌పామ్ రైతులకు అవసరమైన సాయం అందిస్తాం. 2024%-%25 సంవత్సరానికి రాష్ట్రంలో లక్ష ఎకరాల్లో ఆ పంట సాగు లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటికే 77,857 ఎకరాలకు రిజిస్ట్రేషన్ జరగ్గా.. 23,131 ఎకరాలకు అనుమతులిచ్చాం' అని భట్టి విక్రమార్క చెప్పారు.

### ఆరు గ్యారెంటీలకు పెద్దపీట

- ఉచితబస్సు, గ్యాస్, విద్యుత్ పథకాలకు నిధులు
- మహాలక్ష్మి పథకంతో రాష్ట్ర అభివృద్ధికి తోడ్పాటు
- ఆర్టీసీ ఉచిత బస్సుకు రూ.200 కోట్లు
- గ్యాస్ సిలిండర్ల కోసం రూ.723 కోట్లు

3 లో..

### 33 రకాల వరి పంటలకు బోనస్

- సన్నాలను పండించేలా ప్రోత్సాహకాలు
- క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లింపు
- వ్యవసాయ రంగానికి రూ.72,659 కోట్లు
- హార్టికల్చర్‌కు రూ.737 కోట్లు
- పశుసంవర్ధక రంగానికి రూ.1980 కోట్లు



### భూమిలేని కూలీలకు ఏటా రూ.12 వేల సాయం

3 లో..

## కాంగ్రెస్ ప్రభుత్వానికి నిర్దిష్ట విధానం లేదు

### బడ్జెట్‌లో అన్ని రంగాలను విస్మరించారు

### వ్యవసాయ, పారిశ్రామిక, ఐటీ పాలసీలపై అస్పష్టత

### మీడియా పాయింట్ వద్ద కేసీఆర్ విమర్శలు

### ఓటమి తరవాత తొలిసారి అసెంబ్లీకి హాజరు

**హైదరాబాద్ బ్యూరో, ప్రజానావ:**

తెలంగాణ బడ్జెట్‌లో వ్యవసాయ, పారిశ్రామిక, ఐటీ పాలసీలపై నిర్దిష్ట మైన విధానం లేదని భారాస అధినేత, ప్రతిపక్ష నేత కేసీఆర్ విమర్శిం చారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఆయన తొలిసారి అసెంబ్లీకి హాజ రయ్యారు. కెసిఆర్ ఎప్పుడు వస్తారా అని ఎదురుచూస్తున్న వారి ఉత్కంఠకు తెరదించుతూ సమావేశాలకు వచ్చారు. బడ్జెట్ ప్రసంగం తరవా త అసెంబ్లీ విరీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు.

మిగతా 2 లో





2 లో..

### బడ్జెట్ అంకెల గారడీ తప్ప మరోటి లేదు

- ఆత్మస్తుతి.. పరనిందలా బడ్జెట్ ప్రసంగం
- ఎన్నికల హామీలకు ఎగనామం పెట్టిన భట్టి
- మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శలు

### గ్యారెంటీలను గంగలో కలిపిన బడ్జెట్

బీఆర్ఎస్ నేత కేటీఆర్ విమర్శలు

2 లో..



7 లో..

### జూరాల ప్రాజెక్టుకు భారీగా వరద

42 గేట్లు ఎత్తి నీటి విడుదల



# విశ్వనగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దుతాం

- మరింత ప్రణాళికాబద్ధంగా అభివృద్ధికి కృషి
- పలు మార్గాల్లో మెట్రో విస్తరణకు నిధులు
- మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధితో మార్పు
- ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క

**హైదరాబాద్, ప్రజానావ:** విశ్వనగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న చారిత్రాత్మక నగరం హైదరాబాద్‌ను మరింత ప్రణాళికాబద్ధంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నట్లు ప్రకటించారు. 2024-25 సంవత్సరానికి సంబంధించిన రాష్ట్ర బడ్జెట్ ను గురువారం ఆయన అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. హైదరాబాద్ నగర అభివృద్ధికి భారీగా రూ.10వేల కోట్లు కేటాయించారు. శంషాబాద్ విమానాశ్రయం వరకు మెట్రో విస్తరణకు రూ.100 కోట్లు, మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు రూ.1500 కోట్లు, ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టు రూ.1,525 కోట్లు, పాతబస్తీ మెట్రో విస్తరణకు రూ.500 కోట్లు, ఔటర్ రింగ్ రోడ్డుకు రూ.200 కోట్లు, హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టుకు రూ.500 కోట్లు, మెట్రో వాటర్ వర్క్స్ రూ.3,385 కోట్లు, హైడ్రా సంస్థకు రూ.200 కోట్లు కేటాయించారు. హైదరాబాద్‌లో ఉద్యోగ, ఉపాధి పొందుతున్నవారికి కార్యాలయాలకు దగ్గరగా, శాటిలైట్ టౌన్‌షిప్‌ల నిర్మాణాన్ని నగరం చుట్టూ ప్రోత్సహిస్తాం. ఈ టౌన్‌షిప్‌లలో సరసమైన ధరల్లో పేద, మధ్యతరగతి వారికి అనుకూలమైన నివాసగృహాల నిర్మాణాలను అందించేలా కృషి చేస్తామన్నారు. ప్రస్తుతం మూడు ట్రాఫిక్ కారిడార్లలో మెట్రో సౌకర్యం ఉంది. వివిధ వర్గాల అవసరాలను తీర్చడంతో పాటు నగరంలో అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో, ప్రభుత్వం 78.4 కి.మీ. పొడవున్న 5 అదనపు కారిడార్లను రూ.24,042 కోట్లతో అభివృద్ధి పరుస్తుంది. ఇందులోభాగంగా మెట్రో రైలును పాతనగరానికి పొడిగించి దానిని శంషాబాద్ విమానాశ్రయానికి అనుసంధానం చేస్తామన్నారు. ప్రస్తుతమున్న కారిడార్లను నాగోలు నుంచి ఎల్.బి.నగర్ వరకు విస్తరిస్తాం. నాగోలు, ఎల్.బి.నగర్, చంద్రాయణగుట్ట స్టేషన్లను ఇంటర్ ఛేంజ్ స్టేషన్లగా అభివృద్ధి చేస్తాం. మియాపూర్ నుంచి పటాన్ చెరువుకు, ఎల్.బి.నగర్ నుంచి హయత్ నగర్ వరకు మెట్రో రైలు సౌకర్యాన్ని పొడిగించాలని కూడా ప్రణాళిక సిద్ధం చేశాం. హైదరాబాద్, ఔటర్ రింగ్ రోడ్డు వరకు గల ప్రాంతాలను కోర్ అర్బన్ రీజియన్‌గా గుర్తించి వాటి అభివృద్ధికి ప్రత్యేకంగా ప్రణాళికలు రూపొందిస్తాం. ఔటర్ రింగు రోడ్డును నగర సరిహద్దుగా పరిగణిస్తాం. ఓఆర్ఆర్ పరిధిలో విపత్తుల నిర్వహణకు ఒక ఏకీకృత సంస్థ ఏర్పాటు. జీహెచ్ఎంసీ సహా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజ్‌గిరి, సంగారెడ్డి జిల్లాలు దీని పరిధిలోకి వస్తాయి. పట్టణ విపత్తులను నివారించడానికి, వాటిని ఎదుర్కొనడానికి తీసుకోవాల్సిన చర్యలను చేపట్టడంతో పాటు, ఎటువంటి విపత్కర పరిస్థితిన్కైనా ఎదుర్కొని తక్షణ రక్షణ చర్యలు తీసుకొనే విషయంలో జాతీయ, రాష్ట్రేతర సంస్థలతో సమన్వయం. ఈ వ్యవహారాలను పర్యవేక్షించే బాధ్యత హైదరాబాద్ విపత్తు నివారణ, ఆస్తుల పరిరక్షణ సంస్థ చేస్తుంది. ఈ సంస్థలో ఆస్తుల పరిరక్షణకు, విపత్తుల నిర్వహణకు ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేశామన్నారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా సుమారు 110 చదరపు కి.మీ. పట్టణ ప్రాంతం పునరుజ్జీవనం. నదీ తీర ప్రాంతంలో కొత్త వాణిజ్య, నివాస కేంద్రాలు, పాత హెరిటేజ్ ప్రాంతాలకు కొత్త సొబగులు అద్దుతామని అన్నారు. మూసీ నదీ పరివాహక ప్రాంత అభివృద్ధి ప్రాజెక్టులో రిక్రియేషన్ జోన్లు, పాదచారుల జోన్‌లు, పీపుల్స్ ప్లాజాలు, చిల్డ్రన్స్ థీమ్ పార్కులు, ఎంటర్‌టైన్‌మెంట్ జోన్‌ల అభివృద్ధి. లండన్ నగరంలో ఉన్న థేమ్స్ నదీ పరివాహక అభివృద్ధి తరహాలో మూసీ అభివృద్ధి. హైదరాబాద్ నగరాభివృద్ధి, మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు రూ.1,500 కోట్లు ప్రతిపాదన చేశారు. హైదరాబాద్ నగర ప్రాధాన్యం దృష్ట్యా నగరాభివృద్ధికి మరింత పెద్దపీట వేస్తున్నట్లు ప్రకటించారు. సేవలను ప్రజలకు మరింత మెరుగ్గా అందించేందుకు హెచ్ఎండిఎ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు రూ.3,065 కోట్లు కేటాయించారు. మౌలిక వసతుల కల్పనకు రూ.500 కోట్లు. మెట్రో వాటర్ వర్క్స్‌కి రూ.3,385 కోట్లు ప్రతిపాదన. హైడ్రాకి రూ.200 కోట్లు, ఎయిర్ పోర్టు వరకు మెట్రో విస్తరణకు రూ.100 కోట్లు, ఔటర్ రింగ్ రోడ్డు కోసం రూ.200 కోట్లు, హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుకి రూ.500 కోట్లు, పాత నగరానికి మెట్రో విస్తరణకి రూ.500 కోట్లు, మల్టీ మోడల్ సబర్బన్ రైలు ట్రాన్స్‌పోర్టు సిస్టమ్ కోసం రూ.50 కోట్లు కేటాయించారు. రీజనల్ రింగ్ రోడ్‌తో అభివృద్ధి మరింత వేగవంతం. ఉత్తర ప్రాంతంలోని 158.6 కి.మీ. పొడవున్న సంగారెడ్డి తూప్రాన్ -గజ్వేల్ - చౌటుప్పల్ రోడ్డును, దక్షిణ ప్రాంతంలోని 189 కి.మీ.ల పొడవున్న చౌటుప్పల్ -షాద్ నగర్-సంగారెడ్డి రోడ్డును, జాతీయరహదారులుగా ప్రకటించడానికి వీలుగా అప్ గ్రేడ్ చేయాలని ప్రభుత్వం ప్రతిపాదన. రీజనల్ రింగు రోడ్డు హైదరాబాద్ నగర ఉత్తర -దక్షిణ ప్రాంతాలనూ, తూర్పు-పశ్చిమ ప్రాంతాలనూ కలుపుతూ జాతీయ-రహదారి నెట్‌వర్క్‌తో అనుసంధానం చేస్తామని అన్నారు. ఎక్స్‌ప్రెస్‌వే ప్రమాణాలను దృష్టిలో ఉంచుకొని దీని నిర్మాణానికి తగినంత భూమిని సేకరించే ప్రయత్నం. ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా తొలుత నాలుగు లేన్లతో నిర్మించి దానిని ఎనిమిది లేన్ల సామర్థ్యానికి విస్తరణ. ప్రాథమిక అంచనాల ప్రకారం ఆర్.ఆర్.ఆర్ ఉత్తర ప్రాంత అభివృద్ధికి రూ.13,522 కోట్లు. దక్షిణ ప్రాంతాభివృద్ధికి రూ.12,980 కోట్లు ఖర్చు. దీనికోసం బడ్జెట్‌లో ప్రస్తుతం రూ.1525 కోట్ల ప్రతిపాదన చేశారు.

# సుప్రీం ఆదేశాలతో నీట్ తుది ఫలితాల వెల్లడి

- 61 నుంచి 17కు తగ్గిన టాప్ ర్యాంకర్ల సంఖ్య
- వెబ్‌సైట్‌లో ఫలితాలను విడుదల చేసిన ఎన్‌టీఏ

**న్యూఢిల్లీ :** నీట్ యూజీ 2024 పరీక్ష వివాదం వేళ ఇటీవల సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించిన నేపథ్యంలో ఫిజిక్స్ విభాగంలో ని ఓ ప్రశ్నకు ఒకటే సమాధానం ఉంటుందని నిపుణుల కమిటీ తేల్చడంతో దాని ఆధారంగా ఫలితాలను సవరించాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో పరీక్ష తుది ఫలితాలను ఎన్‌టీఏ గురువారం విడుదల చేసింది. ఇందులో 4.2లక్షల మంది అభ్యర్థులు 5 మార్కులను కోల్పోయారు. దీంతో టాప్ ర్యాంక్ సాధించిన వారి సంఖ్య కూడా 61 నుంచి 17కు తగ్గింది. సవరించిన ఫలితాలను విద్యార్థులు ఎన్‌టీఏ అధికారిక వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చు. ఫిజిక్స్ విభాగంలోని అటామిక్ థియరీకి సంబంధించిన 29వ ప్రశ్నకు రెండు సమాధానాలు ఉన్నాయని, వాటిలో దేన్ని ఎంపిక చేసినా... మార్కులిచ్చారని ఆరోపిస్తూ ఓ అభ్యర్థి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం.. ముగ్గురు నిపుణులతో కమిటీని ఏర్పాటు చేసి, నివేదిక అందించాలని ఐఐటీ%-%ఢిల్లీని ఆదేశించింది. ఈ క్రమంలోనే సంబంధిత ప్రశ్నకు ఒక సమాధానమే ఉందని, రెండు లేవని... ఆప్షన్ 4 ఒక్కటే సమాధానమని నిపుణుల కమిటీ కోర్టుకు విన్నవించింది. దాంతో ఆప్షన్ 4ను ఎంచుకున్న అభ్యర్థులకే మార్కులు ఇవ్వాలంటూ ధర్మాసనం పరీక్ష నిర్వాహకులను ఆదేశించింది. ఫలితంగా మరోసారి రివైజ్డ్ ర్యాంకులను విడుదల చేయడం అనివార్యంగా మారింది. తాజాగా ఎన్‌టీఏ తుది ఫలితాలను వెల్లడిరచగా.. సుమారు 4.2లక్షల మంది అభ్యర్థులు 5 మార్కులు కోల్పోయారు. దీంతో మెరిట్ లిస్ట్ మారింది. అంతేకాదు.. 720కి 720 స్కోరు సాధించిన 61 మందిలో ఈ ప్రశ్నకు మార్కులు పొందిన వారు 44 మంది ఉన్నారు. వారి స్కోరు కూడా మారడంతో టాప్ ర్యాంకర్ల జాబితా 17కు తగ్గింది.

# కాంగ్రెస్ ప్రభుత్వానికి నిర్దిష్ట విధానం లేదు

(మొదటిపేజీ తరువాయి)

భారాస హయాంలో మేం రెండు పంటలకు రైతుబంధు ఇచ్చాం. కాంగ్రెస్ ప్రభుత్వం దీన్ని ఎగ్గొడతామని చెబుతోంది. మేం రైతులకిచ్చిన డబ్బును దుర్వినియోగం చేసినట్లు ఆరోపిస్తున్నారు. ఇది పూర్తిగా రైతు శత్రు ప్రభుత్వమని తెలుస్తోంది. ధాన్యం కొనుగోలు చేయలేదు. విద్యుత్, నీటి సరఫరా, గొర్రెల పంపిణీ లేదు. రైతు భరోసా గురించి ప్రస్తావనే లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, వృత్తి కార్మికులను వంచించింది. రాష్ట్ర బడ్జెట్ ప్రజల ఆశలపై నీళ్లు చల్లింది. ఇది పేదల, రైతు బడ్జెట్ కాదని అన్నారు. ప్రభుత్వానికి ఒక విదానమంటూ లేదన్నారు. కథ చెప్పారు తప్ప.. బడ్జెట్ పెట్టినట్టు అనిపించలేదన్నారు. రైతు భరోసాలో అనేక ఆంక్షలు పెడుతున్నట్టు చెప్పారు. ప్రజల గొంతు కోసింది ఈ ప్రభుత్వం. దళితబంధు పథకం ప్రస్తావనే లేదు. దళితులంటే ప్రభుత్వానికి ఉన్న ప్రేమ ఇదేనా? గొర్రెల పెంపకం పథకానికి తూట్లు పొడిచారు. ఒత్తి పలకడం తప్ప భట్టి కొత్తగా చెప్పిందేవిరీ లేదు. రైతులను పొగిడినట్టే పొగిడి నిండా ముంచారు. బడ్జెట్ ఒట్టి డొల్ల. అన్ని వర్గాలను మోసం చేసింది. కథ చెప్పారు తప్ప.. బడ్జెట్ పెట్టినట్టు అనిపించలేదు. పేదల కోసం ఒక్క పాలసీ అయినా ప్రకటించారా? బడ్జెట్‌లో ఒక పద్దు.. పద్ధతి లేదు. బడ్జెట్‌పై ప్రభుత్వాన్ని చీల్చి చెండాడుతాం అన్నారు. యాదవులు, మత్స్యకారులను ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రభుత్వానికి ఆరు నెలల సమయం ఇచ్చాం. ఈ ప్రభుత్వానికి పాలసీ లేదని అర్థమైంది. ఐటీ, పారిశ్రామిక పాలసీ ఏది? ఏ ఒక్క కొత్త సంక్షేమ పథకం ప్రకటించలేదు' అని కేసీఆర్ విమర్శించారు. ఈ బడ్జెట్‌ప్రజల ఆశలపై నీళ్లు చల్లిందన్నారు. రైతులను పొగిడినట్లే పొగిడి వెన్నుపోటు



పొడిచారని విమర్శించారు. తాము ప్రజలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. మత్స్యకారులకు భరోసా లేదని గొర్రెల పంపిణీ పథకాన్ని పూర్తిగా మూసివేసినట్లు కనిపిస్తోందని అన్నారు. దళిత బంధు ప్రస్తావన లేదని తెలిపారు. ఒక్క కొత్త పథకం ప్రవేశపెట్టలేదని విమర్శించారు. రాష్ట్రంలో వ్యవసాయ, పరిశ్రమల సంగతి ఏంటని ప్రశ్నించారు. రైతులను వృత్తికార్మికులను ప్రభుత్వం వంచించిందని మాజీ సీఎం కేసీఆర్ విమర్శించారు. ఆయారంగాల అభివృద్ధికి ఏం చర్యలు తీసుకుంటున్నారో విధివిధానాలు లేవన్నారు. ఉన్న పథకాలను మూసివేస్తున్నట్లు కనిపిస్తుందన్నారు. ఓడిన తర్వాత.. ప్రతిపక్ష నేత హోదాలో బ్జడెట్ సమావేశానికి హాజరైన కేసీఆర్.. విరీడియా కేవలం రెండు నిమిషాలు మాత్రమే మాట్లాడి.. తాను చెప్పాలనుకున్నది చెప్పి వెళ్లిపోయారు.

# బడ్జెట్ అంకెల గారడీ తప్ప మరోటి లేదు

- ఆత్మస్తుతి.. పరనిందలా బడ్జెట్ ప్రసంగం
- ఎన్నికల హామీలకు ఎగనామం పెట్టిన భట్టి
- మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శలు

**ఖైరతాబాద్, ప్రజానావ:** రాష్ట్ర అసెంబ్లీలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆసాంతం ఆత్మస్తుతి, పరనింద తప్ప మరేవిరీ లేదని మాజీ మంత్రి హరీష్ రావు విమర్శించారు. బడ్జెట్ లో ఆసరా పెన్షన్‌ల ప్రస్తావనే తీసుకురాలేదని అన్నారు. మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామని ఎన్నికల సందర్భంగా హావిరీ ఇచ్చారని, కానీ ఆ ఊసే ఎత్తలేదని మండిపడ్డారు. ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని కాంగ్రెస్ నేతలు ఎన్నికల సందర్భంగా హావిరీలు ఇచ్చారని, ఆ విషయాన్ని కూడా ఎక్కడా ప్రస్తావించలేదని హరీష్‌రావు ఆరోపించారు. ఆసరా పెన్షన్‌ల ప్రస్తావన తేకుండా వితంతువులు, వృద్ధులు, వికలాంగులను ప్రభుత్వం నిరాశపర్చిందని విమర్శించారు. కాంగ్రెస్ సర్కారుకు పేదల ప్రభుత్వం అని చెప్పుకునే అర్హత లేదని అన్నారు. బడ్జెట్ పూర్తిగా అంకెల గారడీలా ఉన్నదని, ఇది రాష్ట్రాన్ని తిరోగమనం వైపు నడిపేదని హరీష్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని గొప్పలకు పోయిన కాంగ్రెస్ సర్కారు.. ఆ ప్రస్తావనే తేకపోవడం దారుణమని అన్నారు. ఆర్భాటంగా అభయ హస్తం దరఖాస్తులు స్వీక రించిన ప్రభుత్వం.. ఇప్పుడు ఆరు గ్యారెంటీ ఊసెత్తలేదని మండిపడ్డారు. ఆసరా పింఛన్‌లు పెంచుతామని ఎన్నికల్లో హావిరీలు ఇచ్చారని, వృద్ధుల పెన్షన్‌ను రూ.2 వేల నుంచి రూ.4 వేలకు, వికలాంగుల పెన్షన్‌ను రూ.4 వేల నుంచి రూ.6 వేలకు పెంచుతామని ఎన్నికల సందర్భంగా కాం గ్రెస్ హావిరీ ఇచ్చిందని.. బడ్జెట్ లో ఆ ప్రస్తావన ఎందుకు చేయలేదని హరీష్‌రావు ప్రశ్నించారు. ఇచ్చిన మాట తప్పడం ద్వారా ప్రభుత్వం పేదలను మోసం చేసిందని విమర్శించారు. ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి ఓట్లు దండుకున్న సర్కారు.. ఇప్పుడు రెండు లక్షల ఉద్యోగాల గురించి మాట్లాడలేదని, మాయమాటలతో విద్యార్థులను మోసం చేసిందని హరీష్‌రావు మండిపడ్డారు. ఆటో కార్మికులకు రూ.12 వేలు ఇస్తామని ఎన్నికల సందర్భంగా చెప్పారని, ఇప్పుడు ఆ విషయం ఎందుకు ప్రస్తావించలేదని ప్రశ్నించారు. ప్రభుత్వం వైఖరి కారణంగా ఇప్పటికే 50 మంది ఆటో కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారని హరీష్‌రావు గుర్తుచేశారు. రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చారని గత ప్రభుత్వ పాలన విరీద బురద జల్లే ప్రయత్నం చేశారని హరీశ్‌రావు పేర్కొన్నారు. భట్టి విక్రమార్క చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు హరీశ్‌రావు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరానికి రూ. 57 వేల కోట్ల అప్పులు తెచ్చుకుంటామని బడ్జెట్‌లో భట్టి విక్రమార్క ప్రతిపాదించారు. గత ప్రభుత్వం కంటే రూ. 17 వేల కోట్ల అప్పులు ఎక్కువగా తెచ్చుకుంటామని ప్రతిపాదించారు. గతంలో ఆర్థిక మంత్రిగా నేను ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రూ.40 వేల కోట్లు ఎఫ్ఆర్‌బీఎం కింద అప్పులు ప్రతిపాదిస్తే, భట్టి విక్రమార్క మాత్రం రూ. 57 వేల కోట్లు ప్రతిపాదించారు. మా కంటే రూ. 17 వేల కోట్లు ఎక్కువగా చూపించారు అని హరీశ్‌రావు తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వం ఘనతలను తమ ఘనతలుగా చెప్పుకునే ప్రయత్నం చేసి.. ఈ పదేండ్లలో అభివృద్ధే జరగలేదని చెప్పే ప్రయత్నం చేశారు భట్టి విక్రమార్క. ఈ దేశంలో తలసరి ఆదాయంలో తెలంగాణ నంబర్ వన్ స్థానంలో ఉంది. పదేండ్ల కింద తెలంగాణ 13వ స్థానంలో ఉండే. అక్కడున్న తెలంగాణను ప్రథమస్థానంలోకి తెచ్చాం. దాన్ని కేంద్ర ప్రభుత్వం కూడా మెచ్చుకుంది.గత పదేండ్లలో జరిగిన అభివృద్ధి కూడా తమ ఘనతగా చెప్పుకునే ప్రయత్నం చేశారు. జాతీయ తలసరి ఆదాయం కంటే తెలంగాణ రాష్ట్ర తలసరి ఆదాయం ఒక లక్షా 64 వేల 63 రూపాయాలు ఎక్కువ. ఈ రాష్ట్ర పౌరుడి తలసరి ఆదాయం 3,47,299. అయితే దేశ పౌరుడి తలసరి ఆదాయం 1,83,236. అంటే తెలంగాణ రాష్ట్ర తలసరి ఆదాయం ఒక లక్షా 64 వేల 63 రూపాయాలు ఎక్కువగా ఉంది.. పదేండ్ల బీఆర్ఎస్ పాలన, కేసీఆర్ పాలన ఫలితం ఇది. మేం అధికారంలోకి వచ్చినప్పుడు 13 స్థానంలో ఉంటే.. ప్రథమ స్థానంలోకి వచ్చామంటే మా పరిపాలనకు గీటురాయి అని హరీశ్‌రావు పేర్కొన్నారు. స్థూల ఉత్పత్తి రాష్ట్ర ప్రభుత్వ పనితీరును సూచిస్తుంది. కేసీఆర్ అధికారంలోకి వచ్చినప్పుడు.. స్థూల ఉత్పత్తి రూ. 4, 51,580 కోట్లు.. ఈసారి 2023-24కు వచ్చేసరికి రూ. 14,63, 963 కోట్లు. అంటే జీఎస్డీపీ పెరిగింది.. మూడు రెట్లు పెరిగిదంటే అది మా పనితీరుకు నిదర్శనం. జాతీయ వృద్ధిరేటు 9.1 ఉంటే.. తెలంగాణ వృద్ధి రేటు 11.9 శాతంగా ఉంది. తెలంగాణ వృద్ధిరేటు రెండు శాతం ఎక్కువగా ఉందని హరీశ్‌రావు తెలిపారు. హైదరాబాద్ అభివృద్ధిని గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని.. కళ్లుండి చూడలేని కబోదులు అలా మాట్లాడుతారు. భట్టి వ్యాఖ్యలపై హైదరాబాద్ ప్రజలు నవ్వుకుంటున్నారు. హైదరాబాద్ అభివృద్ధి విషయంలో మొన్నటి దాకా పనిచేసిన ప్రభుత్వం నా కంటే బాగా పని చేసిందని చెబుతూ ఇటీవలే సీఎం చంద్రబాబు నాయుడు కేసీఆర్ అభివృద్ధిని కొనియాడారు. హైదరాబాద్ అభివృద్ధిని లోకం మొత్తం మెచ్చింది. రజనీకాంత్ కూడా హైదరాబాద్ అభివృద్ధిని ప్రశంసించా రు. ఆ రజినీలకు అర్థమైంది కానీ కాంగ్రెస్ గజనీలకు అర్థం కావడం లేదు. ఎంతోమంది హైదరాబాద్‌ను మెచ్చు కున్నారు. అభివృద్ధి జరగలేదని మాట్లాడడం జోక్. ప్రభుత్వానికి విజన్ లేదని అర్థమవుతుంది అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# బడ్జెట్‌పై కేసీఆర్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ భగ్గు

## బీజేపీ ఆదేశాలతో అసెంబ్లీకి వచ్చారని మండిపాటు

**ఖైరతాబాద్, ప్రజానావ:** ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై బీఆర్ఎస్ అధినేత, విపక్ష నేత కేసీఆర్ చేసిన కామెంట్స్‌కు కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. అసెంబ్లీ విరీడియా పాయింట్‌లో మాట్లాడిన మంత్రులు, ఎమ్మెల్యేలు.. కేసీఆర్ వ్యాఖ్యలపై విమర్శలు గుప్పించారు. కేంద్ర బడ్జెట్‌పై స్పందించని కేసీఆర్.. రాష్ట్ర బ్జడెట్ విరీద మాట్లాడటం విడ్డూరంగా ఉందని మంత్రి సీతక్క విమర్శించారు. తెలంగాణకు ద్రోహం చేసన కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేస్తే కేసీఆర్ ఎందుకు రాలేదని ప్రశ్నించారు. కేంద్ర బడ్జెట్‌పై మాట్లాడని కేసీఆర్.. రాష్ట్ర బడ్జెట్‌ను విమర్శించడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఇది ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామని సీతక్క అన్నారు. బీజేపీతో ఒప్పందంలో భాగంగానే అసెంబ్లీకి వచ్చిన మొదటి రోజే రాష్ట్ర ప్రభుత్వాన్ని కేసీఆర్ టార్గెట్ చేస్తున్నారని విమర్శించారు. బీజేపీ మెప్పు కోసమే కేసీఆర్ విమర్శలు చేస్తున్నారన్నారు. 6 నెలల తరువాత అసెంబ్లీ సమావేశాలకు రావడమే ఇందుకు నిదర్శనం అన్నారు. అదికూడా బిజెపి ఆదేశిస్తేనే అసెంబ్లీకి వచ్చారని అన్నారు. 'ఎన్నడూ లేని విధంగా ఈ రోజు కేసీఆర్ విరీడియా పాయింట్‌కి వచ్చారని అచ్చంపేట కాంగ్రెస్ ఎమ్మెల్యే వంశీ కృష్ణ అన్నారు. తొందర్లోనే కోర్టు బోన్‌లోకి వస్తారు. కేసీఆర్ ఊహల్లో బతికారు. ఇంకా నేనే రాజు అనుకుంటున్నారు. విరీరు పెట్టిన బడ్జెట్ ఎవరికి ఉపయోగ పడలేదు. నీళ్ళు, నిధులు, నియామకాల కోసమే తెలంగాణ తెచ్చుకుంది. కానీ గత ప్రభుత్వం నీళ్ళు ఇవ్వలేదు.. నిధులూ ఇవ్వలేదు.. ఇంక నియామకాల ఊసే అస్సలు లేదు. అప్పులు చేసి తెలంగాణ ప్రజల జీవితాలపై వేశారు.' అని ఎమ్మెల్యే వంశీ కృష్ణ ఫైర్ అయ్యారు. వాస్తవానికి బ్జడెట్ దగ్గర ఉందని నారాయణఖేడ్ కాంగ్రెస్ ఎమ్మెల్యే సంజీవ రెడ్డి అన్నారు. అందుకే ప్రతిపక్షానికి మింగుడు పడటం లేదు. కాళేశ్వరం ప్రాజెక్టు గంగలో కలిపారు. లక్ష రూపాయల రుణమాఫీ ఇప్పటికే చేసిన ఘనత రేవంత్ రెడ్డికి దక్కింది. ఇప్పటికి పెండింగ్ బిల్లులు రావడం లేదని అన్నారు. గత ప్రభుత్వం మాదిరి అంకెల రూపంలో బడ్జెట్ పెట్టకుండా.. అన్ని శాఖలకు కేటాయింపులు చేపట్టారని కాంగ్రెస్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. వాస్తవిక బడ్జెట్ ప్రవేశపెట్టడం జరిగింది. ఒక్కో రంగానికి ఎన్ని డబ్బులు కేటాయిస్తున్నం అనేది విపులంగా వివరించారు. సంక్షేమం, అభివృద్ధి రెండు జరగాలని కేటాయింపులు చేయడం జరిగింది. గత బడ్జెట్‌లో కన్నా వైద్య విద్య కోసం ఎక్కువ కేటాయింపులు చేశారు. రూ. 9 వేల కోట్లు పైచిలుకు బడ్జెట్ పెట్టి.. వైద్య విద్యకు పూర్వ వైభవం తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తుంది. బడ్జెట్ ను తులనాడే విధంగా కేసీఆర్ మాట్లాడారు. గత బడ్జెట్ పేపర్లకు పరిమితం అయ్యింది. కేసీఆర్ ఇంకా ఊహల్లో ఉండకుండా.. బడ్జెట్ ను ఆహ్వానించాలని అన్నారు. రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా సంక్షేమం బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం జరిగిందని కాంగ్రెస్ ఎమ్మెల్యే మధన్ మోహన్ రావు అన్నారు. ఇది రైతు బడ్జెట్. తెలంగాణ వచ్చిన పదేళ్లలో నీటిపారుదల ప్రాజెక్టులు అని డబ్బులు తగలేశారు. గ్రావిరీణ ప్రాంతాల్లో రోడ్లు.. తాగు నీటి సదు-పాయాలు లేవు. స్కూల్స్‌లో టీచర్స్ లేరు. వైద్య, విద్య రంగాలకు నిధులు కేటాయింపు చేయడం జరిగింది. జాబ్ క్యాలెండర్ కూడా పెట్టడం జరిగింది. సెప్టెంబర్ 5, 6 లోగా గ్లోబల్ మేథోసంపత్తి కోసం స్కిల్ యునివర్సిటీ పెట్టే విధంగా ఏర్పాటు చేస్తున్నాం. గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుకు లక్షల కోట్లు తగల వేశారు. కానీ, ఇప్పుడు బడ్జెట్లో నిధులు పెట్టారని అన్నారు.

## గ్యారెంటీలను గంగలో కలిపిన బడ్జెట్

### బీఆర్ఎస్ నేత కేటీఆర్ విమర్శలు

**హైదరాబాద్, ప్రజానావ:** రాష్ట్ర బడ్జెట్ గ్యారెంటీలను గంగలో కలిపిం దని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఈ బడ్జెట్లో ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను పట్టించుకోలేదని, ఇది పూర్తిగా కోతల, ఎగవేతల బడ్జెట్ ఆయన మండిపడ్డారు. ఈ బడ్జెట్ లో ఎన్నికల వాగ్దానాలను గాలికి వదిలేసి ప్రజలను వంచించారని ఆరోపించారు. ఇది డిక్లరేషన్‌లను బుట్టదాఖలు చేసిన దోకేబాజ్ బడ్జెట్ అని ఫైరయ్యారు. ఈ బడ్జెట్ కు ఒక విధానంగానీ, విషయంగానీ, విజన్‌గానీ లేదని.. కేవలం పథకాల పేర్ల మార్పులతో ఏమార్చారని కేటీఆర్ విమర్శించారు. ఆడబిడ్డలకు అన్యాయం జరిగిందని, అన్నదాతలకు సున్నం పెట్టారని ఆరోపించారు. మైనారిటీలకు ఇచ్చిన మాటలన్నీ నీటి మూటలయ్యాయని మండిపడ్డారు.

## విభజన హామీలు నెరవేర్చండి

### ప్రధాని మోడీకి కాంగ్రెస్ ఎంపీ లేఖ

**న్యూఢిల్లీ :** విభజన హామీలను నెరవేర్చాలని ప్రధాని మోదీకి తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు గురువారం లేఖ రాశారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీరని అన్యాయం జరిగింది. విభజన సందర్భంగా తెలంగాణకు ఇచ్చిన ఏ ఒక్క హావిరీ కూడా నెరవేర్చలేదని అన్నారు. పునర్విభజన చట్టం ప్రకారం.. ఐటీఐఆర్, ఐఐఎం, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, కాజీపేట్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, తెలంగాణలోని మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు జాతీయ హోదా, ముఖ్యంగా పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదాపై బడ్జెట్‌లో ప్రస్తావనే లేదన్నారు. తెలంగాణలోని పది ఉమ్మడి జిల్లాలో తొమ్మిది జిల్లాల్లో వెనకబడని ప్రాంతాలు చాలా ఉన్నాయి.. వాటి అభివృద్ధికి నిధుల విషయంలో తీరని అన్యాయం జరిగిందని తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు ఈ లేఖలో తెలిపారు. ఉమ్మడి రాష్ట్రం నుంచి విడిపోయిన ఆంధ్రప్రదేశ్ కు నిధులు కేటాయించారు. అదే తెలంగాణకు తీరని అన్యాయం చేశారని కాంగ్రెస్ ఎంపీలు అన్నారు. ఆంధ్రప్రదేశ్ కు నిధులు ఇవ్వడంలో మాకు ఎలాంటి అభ్యంతరం లేదు.. కానీ తెలంగాణకు నిధులు ఇవ్వకపోవడం చాలా అన్యాయం అన్నారు. తెలంగాణలో ప్రాజెక్టులకు జాతీయ హోదా కల్పించాలని, విభజన హావిరీలను నెరవేర్చాలని చాలా సార్లు ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులను కలిశారు.



# 33 రకాల వరి పంటలకు బోనస్

- సన్నాలను పండించేలా ప్రోత్సాహకాలు
- క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లింపు
- వ్యవసాయ రంగానికి రూ.72,659 కోట్లు
- హార్టికల్చర్‌కు రూ.737 కోట్లు
- పశుసంవర్ధక రంగానికి రూ.1980 కోట్లు

**ఖైరతాబాద్, ప్రజానావ:** తెలంగాణలో వరిసాగు విస్తృతంగా జరుగుతున్నదని, కానీ పండిన పంటలకు సరైన గిట్టుబాటు ధరరా క, పెట్టిన పెట్టుబడి కూడా మిగలక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. అసెంబ్లీలో రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా ఆయన ప్రసంగించారు. 33 రకాల వరి పంటలకు బోనస్ ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. 'తెలంగాణలో వరి సాగు చాలా విస్తృతంగా జరుగుతున్నది. పండిన పంటకు సరైన ధర రాక, పెట్టుబడి కూడా దక్కక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. రాష్ట్రంలో సన్న రకం వరి ధాన్యాల సాగును ప్రోత్సహించడానికి ప్రభుత్వం 33 రకాల వరి ధాన్యాలను గుర్తించి, వాటిని పండించిన రైతుకు క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లించాలని నిర్ణయించింది. దీనివల్ల సన్న రకం వరి సాగు విస్తీర్ణం పెరిగి, రైతులకు ఆర్థిక ప్రయోజనం చేకూరుతుంది. బడ్జెట్లో వ్యవసాయ రంగానికి రూ.72,659 కోట్లు ప్రతిపాదించారు. అదేవిధంగా హార్టికల్చర్‌కు రూ.737 కోట్లు, పశుసంవర్ధక రంగానికి రూ.1980 కోట్లు ప్రతిపాదించారు. రాష్ట్రంలో 12.12 లక్షల ఎకరాలలో ఉద్యాన పంటల సాగు ద్వారా 53.06 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి జరుగుతున్నదని చెప్పారు. రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు ఎన్ఎంఈఓ ఓపీ పథకం కింద ఆయిల్ పామ్‌సాగు రైతులకు అవసరమైన సహాయం అందిస్తామన్నారు. 2024-25లో రాష్ట్రంలో లక్ష ఎకరాల్లో ఆయిల్ పామ్‌గు చేసేలా లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. ఇప్పటికే 77,857 ఎకరాలకి రిజిస్ట్రేషన్ జరుగగా, 23,131 ఎకరాలకి అనుమతులు కూడా ఇచ్చామన్నారు. వచ్చిన మొత్తం రిజిస్ట్రేషన్లకి ఈ నెలలోనే ప్లాంటేషన్ మరియు డ్రిప్ అనుమతులు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. పాడిపశువుల పెంపకం గ్రామీణ ప్రజానీకానికి ఎంతో ఆర్థిక పుష్టిని ఇస్తుంది. పాలు, మాంసం, గుడ్లు ప్రజానీకానికి పోషణ అందించడంతో పాటు, అదనపు ఆదాయం ఇస్తాయి. ఇతర అనుబంధ రంగాలైన చేపలు, గొర్రెలు, కోళ్ల పెంపకం ఎంతో మందికి జీవనోపాధికల్పిస్తాయి. ఈ రంగం గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి కల్పిస్తూ, అభివృద్ధిలో కీలక పాత్ర వహిస్తుంది. పాల ఉత్పత్తి రంగంలో 62 శాతం వాటా చిన్న, సన్నకారు,భూమిలేని పేదలదే. వారు రాష్ట్రంలోని పశుసంపదలో 70 శాతం వాటా పొంది ఉన్నారు. ఈ రంగంలో రాష్ట్రం 326.39 లక్షల పశుసంపదతో దేశంలో ఎనిమిదో స్థానంలో ఉంది.శుసంవర్ధక రంగానికి ఈ బడ్జెట్లో రూ.1,980 కోట్లు ప్రతిపాదిస్తున్నాం' అని చెప్పారు

## భూమిలేని కూలీలకు ఏటా 12 వేల సాయం

రాష్ట్రంలో భూమిలేని గ్రామీణ ప్రజానీకం ఎక్కువగా రైతు కూలీలుగా జీవనం గడుపుతోందని, వారికి ఎలాంటి ఆర్థిక భద్రత లేకపోవడంతో పనిదొరకని రోజుల్లో పస్తులు ఉండాల్సి వస్తున్నదని ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. అసెంబ్లీలో వార్షిక బడ్జెట్ ప్రవేశపెడుతూ ఆర్థిక మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు.గ్రామీణ ప్రాంతాల్లో చాలా మందికి సొంత భూములు లేవని, దాంతో వాళ్లు రైతు కూలీలుగా జీవనం గడుపుతున్నారని ఆర్థిక మంత్రి చెప్పారు. వారి జీవితాల్లో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. అందుకే భూమిలేని రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ ఆర్థిక సాయాన్ని ఈ సంవత్సరమే ప్రారంభిస్తామని చెప్పారు.

# బడ్జెట్‌లో ఆరు గ్యారెంటీలకు పెద్దపీట

## ఉచిత బస్సు, గ్యాస్, విద్యుత్ పథకాలకు నిధులు




**మహాలక్ష్మి పథకంతో రాష్ట్ర అభివృద్ధికి తోడ్పాటు**

**ఆర్టీసి ఉచిత బస్సుకు రూ.200 కోట్లు**

**గ్యాస్ సిలిండర్ల కోసం రూ.723 కోట్లు**

**ఖైరతాబాద్, ప్రజానావ:** తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి తీసుకురావడంలో కీలక భూమిక పోషించిన ఆరు గ్యారంటీలకు రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో పెద్దపీట వేసింది. అధికారంలోకి వచ్చిన కొన్నాళ్లకే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్లు వంటి పథకాలను ప్రారంభించిన సర్కారు.. తాజా బడ్జెట్‌లో వాటికి నిధులు కేటాయించింది. ఆరు గ్యారంటీల్లో మరికొన్ని పథకాలనూ ఈ సందర్భంగా ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క తన బడ్జెట్ ప్రసంగంలో ప్రస్తావించారు. పెరిగిన గ్యాస్ సిలిండర్ ధర నుంచి ఊరట కల్పించేందుకు మహాలక్ష్మి పథకం కింద రూ.500కే వంటగ్యాస్ సిలిండర్‌ను తమ ప్రభుత్వం ప్రారంభించిందని భట్టి విక్రమార్క తెలిపారు. ఈ పథకం వల్ల ఇప్పటి వరకు 39,57,637 కుటుంబాలకు లబ్ధి చేకూరిందని, ఇందుకు రూ.200 కోట్లను ప్రభుత్వం వెచ్చిందన్నారు. ఈ బడ్జెట్‌లో గ్యాస్ సిలిండర్ల కోసం రూ.723 కోట్లు ప్రతిపాదిస్తున్నట్లు చెప్పారు. మహిళను మహాలక్ష్మిగా గౌరవించడం మన సంస్కృతి అని, మహాలక్ష్మి పథకం కింద తెలంగాణ రాష్ట్రంలోని మహిళలందరికీ టీజీఆర్‌టీసీ నడిపే బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ప్రయాణించే దూరంపైన, ప్రయాణించే పర్యాయాలపైన ఎటువంటి పరిమితీ విధించలేదని చెప్పారు. ఇప్పటి వరకు 68.60 కోట్ల ప్రయాణాలను మహిళలు చేశారని, పర్యవసానంగా మహిళలకు రూ.2,351 కోట్లు ఆదా అయ్యిందన్నారు. ఉచిత బస్సు సౌకర్యం పరోక్షంగా రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతోందని పేర్కొన్నారు. ఈ పథకానికి అయ్యే ఖర్చు ఆర్టీసీకి ప్రభుత్వం నెలవారీగా చెల్లిస్తోందని, దీనివల్ల ఆర్టీసీ సంస్థ కూడా ఆర్థికంగా బలోపేతమై బిలియన్ డాలర్ కార్పొరేషన్‌గా అవతరించడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఈ ఏడాది మార్చి 1 నుంచి గృహజ్యోతి పథకాన్ని అమలు చేస్తున్నామని భట్టి విక్రమార్క తన బ్జడెట్ ప్రసంగంలో ప్రస్తావించారు. 200 యూనిట్ల కంటే తక్కువ విద్యుత్‌ని వినియోగించుకొనే గృహాలకు ఉచిత విద్యుత్ అందించడం ఈ పథకం ప్రధాన లక్ష్యమన్నారు. ప్రజాపాలన- ప్రజా సేవ కేంద్రాల ద్వారా వచ్చిన ధరఖాస్తులను స్వీకరించి అర్హులైన వారందరికి ఈ ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. ఈ పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు డిస్కంలు సున్నా బిల్లులు జారీ చేస్తున్నాయని, ప్రభుత్వం ఆ బిల్లుల మొత్తం ఛార్జీలను డిస్కంలకు చెల్లిస్తుందని చెప్పారు. జులై 15 నాటికి 45,81,676 ఇళ్లల్లో వెలుగు ల జిలుగులు నింపగా.. జూన్ వరకు అందించిన విద్యుత్తుకుగానూ డిస్కంలకు ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.583.05 కోట్లు చెల్లించిందని అన్నారు. ఈ బ్జడెట్‌లో ఉచిత విద్యుత్‌కు రూ.2,418 కోట్లు కేటాయిస్తున్నట్లు చెప్పారు. నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చడమే తమ ప్రధాన కర్తవ్యమని భట్టి విక్రమార్క అన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్న విధంగా తమ ప్రభుత్వం 'ఇందిరమ్మ ఇళ్లు' నూతన గృహ నిర్మాణ కార్యక్రమాన్ని ప్రారంభించిందని, ఈ పథకం కింద పేదలు ఇల్లు కట్టు కోవడానికి రూ.5 లక్షలు ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించామన్నారు. ఎస్సీ, ఎస్టీ లబ్దిదారులకు రూ.6 లక్షలు చెల్లిస్తామన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ప్రతి నియోజకవర్గంలో కనీసం 3,500 ఇళ్ల చొప్పున మొత్తం 4,50,000 ఇళ్ల నిర్మాణానికి సహకారం అందించాలని నిర్ణయించామని తెలిపారు. రెండు పడక గదుల ఇళ్ల పథకం కింద పూర్తయిన ఇళ్లను త్వరలోనే కేటాయిస్తామన్నారు. పూర్తికాని వాటిని సత్వరమే పూర్తి చేసి మౌలిక వసతులను కల్పించి అర్హులకు అందజేస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి నకాలంలో చెల్లింపులు జరిగేవి కాదని, తమ ప్రభుత్వం 48 గంటల్లోనే చెల్లింపులు చేస్తోం దని భట్టి విక్రమార్క అన్నారు. ఇప్పటి వరకు రూ.10,556 కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లోకి జమ చేశామన్నారు. అర్హులైన రైతులకు మాత్రమే లబ్ధి చేకూరేలా రైతుబంధు పథకం స్థానే రైతు భరోసాను తమ ప్రభుత్వం తీసుకొచ్చిందని భట్టి విక్రమార్క అన్నారు. ఈ పథకం ద్వారా అర్హులైన రైతులకు ఏటా ఎకరానికి రూ.15,000 చెల్లించాలన్నది ప్రభుత్వ సంకల్పమన్నారు. దీని అమలుకు విధివిధానాలు చర్చించి నిర్ణయించడానికి ఒక క్యాబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ఈ కమిటీ ఇప్పటికే పలువురి అభిప్రాయాలను సేకరించిందని, వాటిని సభలో సభ్యులందరి అభిప్రాయాన్ని తీసుకొని అమలు చేయాల్సిన విధి విధానాలపై తగిన నిర్ణయం తీసుకుంటామని ప్రకటించారు.

తెలంగాణలో వరి సాగు చాలా విస్తృతంగా జరుగుతుందని, పండిన పంటకు సరైన ధర రాక పెట్టుబడి కూడా దక్కక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రంలో సన్న రకం వరి ధాన్యాల సాగును ప్రోత్సహించడానికి ప్రభుత్వం 33 రకాల వరి ధాన్యాలను గుర్తించి, వాటిని పండించిన రైతుకు క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లించాలని నిర్ణయించిందన్నారు. దీనివల్ల సన్నరకాల వరిని పండించే సాగు భూమి విస్తీర్ణం పెరిగి, రైతులకు ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు.

# తలసరి ఆదాయంలో మనమే మిన్న

## జాతీయ సగటు కంటే రాష్ట్ర సగటు ఎక్కువ



**హైదరాబాద్, ప్రజానావ:** తెలంగాణ రాష్ట్ర ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క అసెంబ్లీలో రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన బడ్జెట్ ప్రసంగం చేస్తూ.. తలసరి ఆదాయంలో జాతీయ సగటు కంటే రాష్ట్ర సగటు చాలా ఎక్కువగా ఉందని చెప్పారు. 'ప్రస్తుతం తలసరి ఆదాయంలో జాతీయ సగటు కంటే రాష్ట్ర సగటు ఎక్కువ. రాష్ట్రంలో తలసరి ఆదాయ సగటు రూ.3,47, 299 ఉంటే.. జాతీయ తలసరి ఆదాయ సగటు కేవలం రూ.1,83,236గా ఉంది. అంటే జాతీయ తలసరి ఆదాయ సగటుతో పోల్చితే.. రాష్ట్ర తలసరి ఆదాయ సగటు రూ.1,64,063 ఎక్కువగా ఉన్నది' అని భట్టి విక్రమార్క చెప్పారు. అయితే తలసరి ఆదాయ స్థాయిల్లో జిల్లాల మధ్య తీవ్ర అంతరం ఉన్నదని, రంగారెడ్డి జిల్లాలో తలసరి ఆదాయం రూ.9,46,862 ఉంటే.. వికారాబాద్‌లో రూ.1,80,241 ఉన్నదని ఆర్థిక మంత్రి చెప్పారు. జిల్లాల మధ్య ఉన్న ఆదాయ అంతరాలను తగ్గించడానికి తాము కృషి చేస్తామని మంత్రి తెలిపారు.



# హైదరాబాద్‌లో పడకేసిన పారిశుధ్యం

## ఎక్కడ చూసినా చెత్తకుప్పల దర్శనం: కేటీఆర్

**హైదరాబాద్, ప్రజానావ:** హైదరాబాద్‌లో ఎక్కడా చూసినా చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. సుమారు 1000 స్వచ్ఛ ఆటోలు పనిచేయడం లేదన్నారు. బస్తీలు, కాలనీల్లో వ్యర్థాలు పేరుకుపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయని చెప్పారు. డెంగీ, మలేరియా, అతిసారం వంటి సీజనల్ వ్యాధులతో ప్రజలు అవస్థలుపడుతున్నారని వెల్లడించారు. చెత్త తరలింపు కేవలం కాగితాల్లో మాత్రమే కనిపిస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. మేయర్, అధికారుల ఆకస్మిక పర్యటనలు లేకపోవడంతో పారిశుధ్య నిర్వహణ గాడితప్పుతున్నదని చెప్పారు. పర్యవేక్షించాల్సిన పార్ట్-టైం మున్సిపల్ మంత్రేమో ఎమ్మెల్యేల కొనుగోళ్లు, ఢిల్లీ చక్కర్లలో బిజీగా ఉన్నారని ఎద్దేవా చేశారు. ఇకనైనా ప్రభుత్వం మొద్దు నిద్ర వీడాలన్నారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, పౌరుల ఆరోగ్యాలు కాపాడాలని ప్రభుత్వానికి సూచించారు.

# మహారాష్ట్రకు భారీ వర్ష హెచ్చరిక

## ఐఎండి హెచ్చరికలతో పుణెలో పాఠశాలల మూసివేత

**ముంబయి:** మహారాష్ట్రను వర్షాలు ముంచెత్తుతున్నాయి. గురువారం భారీ వర్షాలు కురిసే అవకాశం వుండటంతో భారత వాతావరణ శాఖ మహారాష్ట్రకు, పూణెలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఐఎండి హెచ్చరికల మే-రకు పూణెలోని పింపి, చించ్వాడ్, భోర్, వెల్హా, మావల్, ముల్షి, హవేలా, ఖడక్వాస్లా ప్రాంతాల్లోని పాఠశాలలను మూసివేయాలని జిల్లా మెజిస్ట్రేట్ సుహాస్ దివాస్ ఆదేశాలు జారీ చేశారు. ఈ ప్రాంతాల్లోని ప్రజలు ఇళ్లలోనే ఉండాలని, తప్పనిసరి అయితేనే బయటకు వెళ్లాలని ఆయన ప్రజలకు సూచించారు. గురు, శుక్రవారాల్లో ముంబై నగరంలోని శివారు ప్రాంతాల్లో మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని బృహన్ ముంబై మెట్రో పాలిటన్ కౌన్సిల్ (బిఎంసి) తెలపింది. ఇక జులై 24 ఉదయం 8 గంటల నుండి 25వ తేదీ ఉదయం 8 గంటలకు వరకు 44 మి.మీ వర్షపాతం నమోదైంది. తూర్పు శివారు ప్రాంతాల్లో 90 మి.మీ, పశ్చిమ శివారు ప్రాంతాల్లో 88 మి.మీ వర్షపాతం నమోదైందని బిఎంసి తెలిపింది. ఁగా, పూణెలో బుధవారం రాత్రి కురిసిన వర్షం కారణంగా ఏక్తా నగరి, విఠల్ నగర్ ప్రాంతాల్లోని ఇళ్లు, భవనాల్లోకి నీరు చేరింది. దీంతో పూణె అగ్నిమాపక సిబ్బంది పడవల సహాయంతో ఇళ్లలోని ప్రజలను తరలించేందుకు ప్రయత్నిస్తున్నారు. గురువారం ఉదయం 6 గంటల సమయంలో 40 క్యూసెక్కుల నీటిని ముఠా నదిలోకి పూనె అధికార యంత్రాంగం విడుదల చేసింది. ఈ రోజు ఉదయం నాలుగు గంటలకు 27203 క్యూసెక్కుల వేగంతో నీటిని విడుదల చేశారు. కుండపోత వర్షాలు కురుస్తున్న కారణంగా ఈ నది ఒడ్డున నివసించే వారు జాగ్రత్తగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. పాల్ఘర్, రత్నగిరి, సింధుదుర్గ్ మీదుగా గంటకు 50 నుండి 60 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని జిల్లా సమాచార కార్యాలయం అంచనా వేసింది. అలాగే కొల్హాపూర్, పూణెలోని ఘాట్ ప్రాంతల్లోకూడా గాలులు వీచే అవకాశం ఉంది. వర్షాల కారణంగా ముంబైలోని అంధేరి సబ్‌వేపై రాకపోకలను అధికారులు మూసివేశారు. ముంబై మెట్రోపాలిటన్ ప్రాంతం నీటిని సరఫరా చేసే 7 సరస్సుల్లో ఒకటైన విహార్ సరస్సు ఈరోజు తెల్లవారు జామున 3.50 గంటలకు పొంగిపొర్లింది.

# అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం

## యువకుడు మృతి

**పెద్దపల్లి, ప్రజానావ:** పెద్దపల్లి జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. పాలకుర్తి మండలం ఈశాల తక్కల్లపల్లి గ్రామానికి చెందిన ముగ్గురు యువకులకు బుధవారం రాత్రి 11గం ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలలోకి వెళ్తే.. వివరాల్లోకి వెళ్తే.. ఈశాల తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు దాడి శివ, కొండ వికాస్, పొన్నం సాయి కిరణ్ గోదావరిఖని నుంచి ఈశాల తక్కళ్లపల్లి గ్రామానికి వారి బైక్ పైన వస్తున్నారు. ఈ క్రమంలో ఐ.ఓ.సి పెట్రోల్ పంపు యూటర్న్ వద్ద ఆగి ఉన్న లారీని ఢీ కొట్టడంతో దాడి శివ(18) అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని వెంటనే 108లో గోదావరిఖని ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. శివ మృతి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# పాఠశాలల్లో వర్షపు జల్లులు

## గొడుగులు పట్టుకుని విద్యార్థుల చదువులు

**మంచిర్యాల, ప్రజానావ:** రాష్ట్రంలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు కొరత, మౌలిక వసతుల లేమితో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండా, వాన నుంచి కాపాడాల్సిన తరగతి గదే నీళ్లలో ముంచెత్తుతుండటంతో విద్యార్థులు గొడుగులు ఆసరగా చేసుకొని చదువువాల్సిన దుస్థితి నెలకొంది. ఈ విషాదకర సంఘటన మంచిర్యాల జిల్లాలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే..కృష్ణపల్లి జెడ్పీ సెకండరీ స్కూల్భవనంలో వర్షపు నీరు లీక్‌అవ్వడంతో విద్యార్థులు క్లాసు రూంలో గొడుగులు పట్టుకొని పాఠాలు వింటున్నారు. పుస్తకాలు, పెన్నులు పట్టుకొని చదువాల్సిన విద్యార్థులు ఓ చేతితో పెన్ను మరో చేతితో గొడుగు పట్టుకొని చదువుకోవాల్సిన దుస్థితి నెలకొంది. కాగా, రూ.2 లక్షలతో మరమ్మతులు చేశామని చెప్పిన వర్షపు నీరు లీక్ అవుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.



మూల మలుపులు, ప్రమాదాలు జరిగే ప్రదేశాల్లో సైన్ బోర్డ్స్ ఏర్పాటు చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అధికారులకు ఆదేశించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా గురువారం పోలీస్ అధికారులు ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రధాన రహదారులు వెంబడి మూల మలుపుల వద్ద వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు భారీ కేడ్స్, రబ్బర్ స్ట్రిప్స్, సైన్ బోర్డుల ఏర్పాటుతో పాటు డేంజర్ బోర్డ్స్ ఏర్పాటు చేశారు. అలాగే రహదారికి అడ్డంగా ఉన్న చెట్లను తొలగించారు.

– సిరిసిల్ల, ప్రజానావ



## న్యాయవాదుల 'మ్యాక్ 'సొసైటీకి డైరెక్టర్ల నియామకం



**సిరిసిల్ల, ప్రజానావ:** రాజన్న సిరిసిల్ల జిల్లా అడ్వకేట్ మ్యూచువల్ ఎయిడెడ్ కో ఆపరేటివ్ సొసైటీ (మ్యాక్) ఎన్నికలు గురువారం జిల్లా కేంద్రంలోని పద్మనాయక కల్యాణ మండపంలో జరిగాయి. ఎన్నికల్లో సొసైటీ డైరెక్టర్లుగా గోవింద్ భాస్కర్, వంగ పర్శురాములు, విద్యాసాగర్ రావు, యాట శ్రీనివాస్, కొడిమ్యాల పురుషోత్తం, జ్యోతి, గుర్రం ఆంజనేయులు, జి.కిషన్, అశ్విన్ చంద్ర, వెంకట్ రెడ్డి (కేవీఆర్), ఎన్.అభిలాష్, పీ.అనిల్ కుమార్‌లను న్యాయవాదులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా నియామకమైన డైరెక్టర్లను న్యాయవాదులు అభినందించి, ఘనంగా సన్మానించారు.



## రేపటి నుంచి ఉజ్జయినీ మహంకాళి బోనాల జాతర

**వేములవాడ, ప్రజానావ:** ఆషాఢం మాసం పురస్కరించుకొని వేములవాడ పట్టణంలోని శ్రీ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల జాతర మహోత్సవాలు ఈ నెల 27వ నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ చైర్మన్ మహంకాళి శ్రీనివాస్ గౌడ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించే బోనాల జాతర మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మొదటి రోజు శనివారం ఉదయం అమ్మవారికి విశేష అభిషేకాలు నిర్వహించనున్నారు. అనంతరం అమ్మవారు శాకంబరీ అవతారంలో భక్తులకు దర్శనం ఇస్తారని పేర్కొన్నారు. రెండో రోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మహిళలు బోనాలు సమర్పిస్తారని తెలిపారు. సాయంత్రం 6 గంటలకు విజయవాడకు చెందిన ప్రభ బృందం ఆధ్వర్యంలో వైవిధ్యమైన వేషధారణతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. గొర్రె పొట్టేళ్లు, తొట్టెండ్లు, ఫలహార బండ్లు, పోతరాజుల విన్యాసాలు, నృత్యాలతో.. డప్పు వాయిద్యాల మధ్య పట్టణ పురవీధుల గుండా అమ్మవారు ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. చివరి రోజైన సోమవారం అమ్మవారికి పుష్పాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి జాతర మహోత్సవాలను ఘనంగా ముగించనున్నట్లు తెలిపారు. మూడు రోజుల పాటు కన్నుల పండువగా నిర్వహించే అమ్మవారి బోనాల జాతర మహోత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీర్వాదాలు స్వీకరించాలని శ్రీనివాస్ గౌడ్ కోరారు.

## కేంద్ర బడ్జెట్‌పై బీజేపీ నేతల హర్షం



**చందుర్తి, ప్రజానావ:** కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్నివర్గాల ప్రజలను అభివృద్ధి వైపు పయనింపజేసేట్లుగా ఉందని బీజేపీ సిరిసిల్ల జిల్లా ఉపాధ్యక్షుడు సిరికొండ శ్రీనివాస్, మండలాధ్యక్షుడు పోంచెట్టి రాకేశ్ హర్షం వ్యక్తం చేశారు. చందుర్తి మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా కేంద్ర బడ్జెట్‌పై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. గతంలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ సర్కారు ప్రజలకు అనేక వాగ్దానాలిచ్చి ఏ ఒక్కటీ అమలు చేయలేదని విమర్శించారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం ప్రజలు ఏళ్లుగా ఎదురుచూసినా చందుర్తి మండలంలో ఏ ఒక్కరికీ ఇల్లు మంజూరు కాలేదన్నారు. మూడెకరాల భూమి కోసం దళితులకు ఇచ్చిన వాగ్దానాన్ని కూడా తుంగలో తొక్కారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చి ఏడు నెలలు దాటినా మహిళలకు ఉచిత బస్సు హామీ తప్ప చేసిందేమీ లేదని విమర్శించారు. అనేకమందికి ఇప్పటికీ రుణమాఫీ కాకపోవడంతో రైతులు బ్యాంకుల చుట్టూ తిరిగే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు చింతకుంట గంగాధర్, చిర్రం తిరుపతి, నాయకులు పేరుక గంగరాజు, చింతకుంట సాగర్, లక్కర్స్ శశి కుమార్, గొంటి రాజు, మేడిశెట్టి శ్రీహరి, నేతికుంట బాలరాజు, బొంబోతుల ప్రశాంత్ పాల్గొన్నారు.



## కోటపల్లి ఇంచార్జీ ఎంపీడీవోగా సత్యనారాయణ

**కోటపల్లి, ప్రజానావ:** కోటపల్లి ఇంచార్జీ ఎంపీడీవో గా ముల్కల్ల సత్యనారాయణ రెడ్డి భాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు పుష్ప గుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయ న మాట్లాడుతూ మండలంలో నెలకొన్న సమస్యల పరిష్క రానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




జిల్లా పాలనాధికారి గారి ఆదేశాల మేరకు 1 వార్డు ,2 వార్డ్ నందు వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా చెట్లు నాటడం తో పాటు ఇంటింటికి చెట్ల పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమం 25-7-2024 నుండి 05-8-2024 వరకు వార్డుల వారీగా రోజుకు రెండు వార్డులు చొప్పున నిర్వహించబడును ఈ యొక్క కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండి నవాజుద్దీన్ , మున్సిపల్ కమిషనర్ జి గంగాధర్ ,1 వ వార్డ్ కౌన్సిలర్ శ్రీ పోగుల సతీష్ , 2 వార్డ్ కౌన్సిలర్ కమ్మల శ్రీనివాస్, మున్సిపల్ సిబ్బంది మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

– చెన్నూర్, ప్రజానావ

## జువ్వాడిని కలిసిన రేషన్ డీలర్లు



**మెట్‌పల్లి, ప్రజానావ:** పట్టణంలోని జువ్వాడి భవన్ లో మెట్ పెల్లి రేషన్ డీలర్లు గురువారం కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి జువ్వాడి నర్సింగరావును మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం వారు జువ్వాడితో రేషన్ షాప్ లకు నాణ్యతతో కూడిన బియ్యాన్ని అందించాలని విన్నవించుకోగా ఆయన సివిల్ సప్లై డీఎం హతిరాం కు ఫోన్ చేసి మాట్లాడడం జరిగింది. దానికి డిఎం సానుకూలంగా స్పందిస్తూ నాణ్యత లోపించిన బియ్యం వస్తె వెంటనే రిటన్ పంపండి. ఇక నుండి మేము నాణ్యమైన బియ్యం పంపుతాం అని చెప్పారు. అడగగానే మా సమస్యను పరిష్కరించిన జువ్వాడి నర్సింగరావు కు రేషన్ డీలర్లు కృతజ్ఞతలు తెలిపారు.




## గంజాయి కేసులో నిందుతుడికి రిమాండ్

### 100 గ్రాముల గంజాయి స్వాధీనం

**కోనరావుపేట, ప్రజానావ:** గంజాయి విక్రయిస్తున్న యువకుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు ఎస్ఐ ఆంజనేయులతో కలిసి గురువారం కోనరావుపేట పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. కోనరావుపేట మండలం సుద్దాల గ్రామానికి చెందిన వడ్లూరి వెంకటేశ్ (23) అనే యువకుడు జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం తిప్పాయిపల్లి, భీమ్‌గల్ ప్రాంతాల్లో గుర్తుతెలియని వ్యక్తుల వద్ద గంజాయి కొనుగోలు చేసి తాగేవాడు. మిగిలిన దానిని తెలిసిన వారికి విక్రయించేవాడు.

ఈ క్రమంలో గురువారం వెంకటేశ్ సుద్దాల గ్రామానికి వస్తున్నాడన్న నమ్మదగిన సమాచారంతో అదుపులోకి తీసుకొని 100 గ్రాముల గంజాయిని సీజ్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎవరైనా గంజాయికి సంబంధించిన సమాచారాన్ని డయల్100 లేదా టాస్క్‌ఫోర్స్ సీఐ 87126 56392 నెంబర్‌కి సమాచారం అందించాలని సూచించారు.

## మెట్‌పల్లి మున్సిపల్ పై బీజేపీ జెండా ఎగురుతుంది



**మెట్‌పల్లి, ప్రజానావ:** రానున్న మున్సిపల్ ఎన్నికల్లో అత్యధిక బీజేపీ కౌన్సిలర్ లను గెలుచుకొని మెట్ పల్లి మున్సిపల్ పై బీజేపీ జెండా ఎగుర వేయడం ఖాయమని పార్టీ రాష్ట్ర నాయకులు చిట్నేని రాఘవేంద్రరావు అన్నారు. గురువారం భారతీయ జనతా పార్టీ పట్టణ కార్యవర్గ సమావేశం పట్టణ అధ్యక్షులు బొడ్ల రమేష్ అధ్యక్షతన జరిగింది. కార్యాలయంలో పార్టీ జెండా ఆవిష్కరించి కార్యక్ర మాన్ని ప్రారంభం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ చిట్నేని రాఘవేంద్రరావు హాజరైయి మాట్లాడారు. ఎమ్మెల్యే,ఎంపీ ఎన్నికలలో పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలకు నాయకులకు వారికి అన్ని విధాలుగా అండగా ఉండి వారిని కౌన్సిలర్‌గా గెలిపించుకుంటామని, కాంగ్రెస్ ప్రభు త్వం ఆరుగ్యారెంటీలను తక్షణమే అమలు చేయా లని కోరడం జరిగింది. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ యాదగిరి బాబు, జిల్లా అధికార ప్రతినిధి వడ్డేపల్లి శ్రీనివాసు, స్టేట్ కౌన్సిల్ మెంబర్ ఏలేటి నరేందర్ రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దొనికెల నవీన్, బిజెపి కౌన్సిలర్ మర్రి పోచయ్య, బీజేవైఎం పట్టణ కన్వీనర్ సుంకేట విజయ్, మద్దెల లావణ్య, పుల్ల సౌజన్య, నూనె క్రాంతి, దేవరాజ్యం, కలాలి రాజిరెడ్డి, తోకల సత్యనారాయణ, బోడ్ల ఆనంద్, తిరుమల్, భీమనాతి విజయ్, రూపేష్, తోట ప్రసా ద్, ఆనంద్, కృష్ణమూర్తి, దత్తు ఉమేష్, రాకేష్, మారుతి, వివేక్, మారుతి, అనిల్, మల్లేష్ కుమార్, శీను, బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్రం ఇంచార్జిలు, పట్టణ కార్యవర్గం తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ భేష్

### జిల్లా కార్యదర్శి బొడ్డు సునీల్

**గన్నేరువరం, ప్రజానావ:** రాష్ట్ర అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ 2 లక్షల 91 వేఫల ష159 కోట్ల బడ్జెట్ ను ప్రవేశపెట్టిన రాష్ట్ర ఆర్థిక మంత్రి మట్టి విక్రమార్క , ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ధన్యవాదాలు, తెలిపిన కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి బొడ్డు సునీల్ ఈసందర్భంగా మాట్లాడుతూ టిఆర్ఎస్ ప్రభుత్వంలో పసలేని బడ్జెట్ ప్రవేశపెట్టి ప్రజలకు ఉపయోగపడని ఎన్నో హామీలను ఇచ్చి ఆశలన్నీ నిరాశనే చేసిన గత బిఆర్ఎస్ ప్రభుత్వం తో పోలిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పైనా తెలంగాణ రాష్ట్ర ప్రజానీకం హర్షం వ్యక్తం చేస్తున్నారని , ప్రతి పేదవాడికి న్యాయం జరిగే విధంగా బడ్జెట్ రూపు దిద్దుకుంది అని తెలిపారు , వ్యవసాయానికి ,సాగునీటికి, తాగునీటికి, వైద్యానికి, విద్యకు, అనే కాకుండా అన్ని రకాల ఉపయోగపడే విధంగా ప్రవేశ పెట్టడం జరిగిందని తెలిపారు.

## తెలంగాణ ప్రజల నమ్మకాన్ని

# బీజేపీ ఎంపీలు వమ్ము చేసారు



**న్యూ ఢిల్లీ :** తెలంగాణ నుండి ఇద్దరు కేంద్ర మంత్రి వర్గంలో ఉన్నప్పటికీ న్యాయం జరగలేదని, విభజన చట్టం 2014లో ఉంటే అప్పటి నుండి లేని కేటాయింపులు ఈసారి బడ్జెట్ లోనే ఎందుకు చేసారని భువనగిరి లోక్ సభ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి బీజేపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రధాని కుర్చీ కాపాడుకునేందుకే బడ్జెట్‌లో నితీశ్, చంద్రబాబు రాష్ట్రాలకు న్యాయం చేసారని అన్నారు. లోక్ సభ ఎన్నికల్లో బీజేపీకి సహకరించిన బీఆర్ఎస్ నేతలు, ఇప్పుడు కాంగ్రెస్ పై విమర్శలు చేస్తున్నారు. చిత్తశుద్ధి ఉంటే బీజేపీ ఎంపీ లు తెలంగాణకు జరిగిన అన్యాయ పై పోరా టం చెయ్యాలని భువనగిరి లోక్ సభ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి సూచించారు.



## ఎమ్మెల్యే పార్టీ ఫిరాయింపు

# అంశంపై విచారణ

- తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు
- బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లో చేరిన దానం నాగేందర్
- పార్టీ ఫిరాయింపు అంటూ స్పీకర్‌కు ఫిర్యాదు చేసిన ఏలేటి మహేశ్వర్ రెడ్డి
- స్పీకర్ తన ఫిర్యాదును పట్టించుకోలేదంటూ హైకోర్టులో పిటిషన్

**హైదరాబాద్, ప్రజానావ:** ఎమ్మెల్యే పార్టీ ఫిరాయింపు వ్యవహారంలో తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు ఇచ్చింది. బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి నుంచి పిటిషన్‌ను స్వీకరించాల ని అసెంబ్లీ స్పీకర్‌ను ఆదేశించింది. అసలేం జరిగిందంటే... దానం నాగేందర్ ఇటీవల బీఆర్ఎస్ ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ ఫిరాయింపునకు పాల్పడిన దానం నాగేందర్ పై చర్యలు తీసుకోవాలని తాను చేసిన ఫిర్యాదును స్పీకర్ తీసుకోలేంటూ బీజేపీ ఫ్లోర్ లీడర్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తెలంగాణ హైకోర్టును ఆశ్ర యించారు.
తన ఫిర్యాదును స్పీకర్ స్వీకరించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. మహేశ్వర్ రెడ్డి పిటిషన్ పై హైకోర్టు విచారణ చేపట్టింది. మహేశ్వర్ రెడ్డి నుంచి ఫిర్యాదును స్వీకరించాలని, ఫిర్యాదును అందుకున్నట్టు రసీదు కూడా ఇవ్వాలని అసెంబ్లీ స్పీకర్ కార్యాలయాన్ని ఆదేశించింది.

# హైదరాబాద్‌లో రేవ్ పార్టీ కలకలం



**హైదరాబాద్, ప్రజానావ:** హైదరాబాద్ లో రేవ్ పార్టీ కలకలం రేపింది. మాదాపూర్ సైబర్ టవర్ వద్ద రేవ్ పార్టీని రంగారెడ్డి జిల్లా స్పెషల్ టాస్క్ ఫోర్స్ పోలీసులు భగ్నం చేశారు. పట్టుబడ్డ వారి నుండి విదేశీ మద్యం, 1 గ్రాము కొకైన్, 2 గ్రాముల ఎం.డీ.ఎం.ఏ డ్రగ్, 0.68 గ్రాముల ఓ.జీ కుష్ డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. బేగంపేట్ కు చెందిన నాగరాజు యాదవ్ జన్మదినం సందర్భంగా రేవ్ పార్టీ ఏర్పాటు చేశారు. క్లౌడ్ 9 హోమ్స్ సర్వీస్ అపార్ట్ మెంట్ లో రేవ్ పార్టీకి 14 మంది యువకులు, ఆరుగురు యువతులు హాజరయ్యారు. పార్టీలో యువత విదేశీ మద్యంతో పాటు డ్రగ్స్ తీసుకుంటున్నట్లు గుర్తించారు. గోవా నుండి డ్రగ్స్ తెప్పించారు. పక్కా సమాచారంతో రేవ్ పార్టీ జరుగుతున్న అపార్ట్ మెంట్ పై రంగారెడ్డి జిల్లా ఎస్టీఎఫ్ పోలీసులు, అబ్కారీ శాఖ అధికారులు దాడి చేశారు. రేవ్ పార్టీ కేసును శేరిలింగంపల్లి పోలీసులకు బదిలీ చేశారు.




# తగ్గని ప్రాణహిత నది వరద ఉధృతి

### రాకపోకలు నిలిపివేసిన పోలీసులు

**వేమనపల్లి, ప్రజానావ:** మహారాష్ట్రలో ఎగువ కురుస్తున్న భారీ వర్షాలకు తోడు ఇక్కడ కురుస్తున్న వర్షాలకు వేమనపల్లి సరిహద్దులో ప్రవహిస్తున్న ప్రాణహిత నది మళ్ళీ ఉధృతంగా ప్రవహిస్తుందని అత్యవసరం అయితే తప్ప ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని నీల్వాయి ఎస్సై శ్యామ్ పటేల్ సూచించారు. వేమనపల్లి నుండి కల్లంపల్లి వరకు వెళ్ళ దారిలో సుంపుటం వద్ద లోతట్టు రోడ్డుపై వరద నీరు చేరినందున ముందస్తు జాగ్రత్తల కోసం రాకపోకలు నిలిపివేయడం జరిగిందని అలాగే ముల్కలపేట నుండి రాచెర్ల వెళ్లే ప్రధాన రహదారి వద్దకు వరద పోటెత్తడంతో బొందచెను వంతెన, అప్రోచ్ రోడ్డు మునిగినందున అట్టి రహదారి కూడా మూసివేయడమైనది. దీంతో రాచెర్ల, వెంచపల్లి, సూపక, జనగామ కోటపల్లి మండల పలు గ్రామాలు రాకపోకలు నిలిపివేయడం జరిగింది. కావున ఏదైనా మెడికల్ ఎమర్జెన్సీ ఉంటే నీల్వాయి పోలీస్ వారిని, 8712656557ని సంప్రదించాలని కోరారు.

# కేంద్ర బడ్జెట్‌పై స్పందించని కేసీఆర్

- రాష్ట్ర బడ్జెట్‌పై మాట్లాడటం విడ్డూరం: మంత్రి సీతక్క
- కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందన్న సీతక్క
- కేంద్ర బడ్జెట్‌పై తీర్మానం చేస్తే కేసీఆర్ రాలేదని మండిపాటు
- బీజేపీ మెప్పు కోసం రాష్ట్ర బడ్జెట్‌పై విమర్శలు చేస్తున్నారన్న మంత్రి



**హైదరాబాద్, ప్రజానావ:** కేంద్రబడ్జెట్‌పై స్పందించని కేసీఆర్ రాష్ట్ర బడ్జెట్‌పై మాత్రం మాట్లాడటం విడ్డూరంగా ఉందని మంత్రి సీతక్క అన్నారు. భట్టివిక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై బీఆర్ఎస్ అధినేత విమర్శలు గుప్పించారు. ఆయన వ్యాఖ్యలపై సీతక్క స్పందిస్తూ, కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. దీనిని నిరసిస్తూ నిన్న అసెంబ్లీలో తీర్మానం చేస్తే కేసీఆర్ ఎందుకు రాలేదని ప్రశ్నించారు. ఇది ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. బీజేపీతో ఒప్పందంలో భాగంగానే అసెంబ్లీకి వచ్చిన మొదటి రోజే రాష్ట్ర ప్రభుత్వాన్ని కేసీఆర్ టార్గెట్ చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ మెప్పు కోసం రాష్ట్ర బడ్జెట్‌పై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ఆరు నెలల తర్వాత అసెంబ్లీ సమావేశాలకు రావడమే ఇందుకు నిదర్శనమన్నారు.

**కేసీఆర్‌పై కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఆగ్రహం**

ఎన్నడూ లేనివిధంగా కేసీఆర్ మీడియా పాయింట్‌కు వచ్చారని, త్వరలోనే ఆయన బోను ఎక్కేస్తారని అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఊహల్లో బతికిన కేసీఆర్ ఇంకా తానే రాజును అని భావిస్తున్నారని ఎద్దేవా చేశారు. నీళ్ళు, నిధులు, నియామకాల కోసం తెచ్చుకున్న తెలంగాణలో బీఆర్ఎస్ ఉన్న పదేళ్లలో వాటికి నిధులే ఇవ్వలేదని విమర్శించారు. బడ్జెట్ వాస్తవానికి దగ్గరగా ఉందని అందుకే ప్రతిపక్షానికి మింగుడు పడటం లేదని నారాయణఖేడ్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి అన్నారు. రుణమాఫీ చేసిన ఘనత రేవంత్ రెడ్డికి దక్కిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును గత ప్రభుత్వం గంగలో కలిపిందన్నారు. అన్ని శాఖలకు బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇచ్చామని మరో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. ఒక్కో రంగానికి ఇచ్చే నిధులను విపులంగా వివరించినట్లు చెప్పారు. గతంలో బడ్జెట్ పేపర్లకు పరిమితమయ్యేదన్నారు.
కేసీఆర్ ఇంకా ఊహల్లో ఉండకుండా బడ్జెట్‌ను ఆహ్వానించాలన్నారు. రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాసంక్షేమ బడ్జెట్‌ను ప్రవేశపెట్టామని ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు అన్నారు. పదేళ్ల పాటు నీటిపారుదల ప్రాజెక్టులు అంటూ డబ్బులు తగలేశారని గత ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఇప్పుడు అన్ని రంగాలకు, సంక్షేమానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించామన్నారు.

## విశ్రాంతి తీసుకోమని కేసీఆర్‌కే

# ప్రజలు సమయమిచ్చారు

- కేసీఆర్ నిన్న సభకు ఎందుకు రాలేదో చెప్పాలి
- రాష్ట్ర బడ్జెట్‌పై స్పందించిన కేసీఆర్ కేంద్ర బడ్జెట్ మీద ఎందుకు మాట్లాడలేదు
- ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క

**హైదరాబాద్, ప్రజానావ:** తమకు సమయం ఇచ్చానని కేసీఆర్ అంటున్నారని, కానీ వారు మాకు సమయం ఇచ్చేదేమిటి? విశ్రాంతి తీసుకోమని ప్రజలే వారికి సమయం ఇచ్చారని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. బడ్జెట్ ప్రసంగంపై కేసీఆర్ విమర్శలు చేసినందుకు దానికి దీటుగా భట్టి సమాధానమిచ్చారు. మీడియా పాయింట్ వద్ద భట్టివిక్రమార్క మాట్లాడుతూ... కేసీఆర్ నిన్న సభకు ఎందుకు రాలేదో చెప్పాలన్నారు. ఇప్పుడు హడావుడిగా వచ్చి బడ్జెట్‌పై విమర్శలు చేస్తున్నారని, అంతే హడావుడిగా కేంద్ర బడ్జెట్‌పై ఎందుకు స్పందించలేదో చెప్పాలన్నారు. పక్క రాష్ట్రానికి కేంద్రం నిధులు ఇచ్చిందని, కానీ మన రాష్ట్రం మాటేమిటన్నారు. రాష్ట్రానికి మేలు చేయడానికి తెచ్చిందే రాష్ట్ర విభజన చట్టం అన్నారు. మనకు నిధులు కేటాయించకుంటే కేసీఆర్ ఎందుకు ప్రశ్నించలేదన్నారు.



**కేసీఆర్‌ను తప్పకుండా జైలుకు పంపిస్తాం**

కేసీఆర్‌ను తప్పకుండా జైలుకు పంపిస్తామని కాంగ్రెస్ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. రాష్ట్ర బడ్జెట్‌పై కేసీఆర్ విమర్శలు సరికాదన్నారు. కేసీఆర్‌ను జైలుకు పంపించే బాధ్యతను తీసుకుంటామని సంచలన వ్యాఖ్యలు చేశారు. మీడియా పాయింట్‌కు వచ్చిన నువ్వు కోర్టు బోనుకు కూడా వెళతావ్ అన్నారు. కాంగ్రెస్ హయాంలో రైతులకు పెద్దపీట వేశామన్నారు.



## కేసీఆర్ ఇష్టంలేని పెళ్లి కొడుకులా

# అసెంబ్లీలో కూర్చున్నారు

- యెన్నం శ్రీనివాస్ రెడ్డి
- బడ్జెట్ అంకెలను చూడకుండానే ఊకదంపుడు ఉపన్యాసం

**హైదరాబాద్, ప్రజానావ:** ఇన్నాళ్లకు అసెంబ్లీకి వచ్చిన కేసీఆర్ ఇష్టంలేని పెళ్లి కొడుకులా సభలో కూర్చున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఎద్దేవా చేశారు. బడ్జెట్ ప్రసంగం అనంతరం ఆయన మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ... మీడియా పాయింట్‌ను బహిష్కరించిన కేసీఆరే, ఇప్పుడు అక్కడకు వచ్చి మాట్లాడారన్నారు. బడ్జెట్ బాగుందని, కానీ కేసీఆర్ చూడకుండానే విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. బడ్జెట్ అంకెలను చూడలేదని, చదవకుండా ఊకదంపుడు ఉపన్యాసం ఇచ్చి వెళ్లారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం మైనార్టీలకు రూ.11 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసిందని, కానీ తాము ప్రాధాన్యత ఇచ్చామన్నారు. ఆరు గ్యారెంటీలను అమలు చేసేందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించినట్లు చెప్పారు.

**రైతు సంక్షేమానికి పెద్దపీట: కూనంనేని సాంబశివరావు**



కష్టకాలంలో, సంక్షోభ సమయంలో ఇలాంటి బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం సాహసోపేత నిర్ణయమని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. రైతు సంక్షేమానికి పెద్ద పీట వేశారన్నారు. అయితే, విద్య, వైద్య రంగానికి సరైన కేటాయింపులు జరగలేదని విమర్శించారు. భవిష్యత్తులో అయినా విద్య, వైద్య రంగాలకు నిధులు కేటాయించాలన్నారు. అసంఘటిత కార్మికులను ఆదుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రస్తుత సంక్షోభానికి గత ప్రభుత్వం చేసిన అప్పులే కారణమని విమర్శించారు. మంచి బడ్జెట్‌ను ప్రవేశపెట్టినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

# అనవసరంగా గెలిచా..

- కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి
- అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న తీరు బాధగా ఉందన్న ఎమ్మెల్యే
- లోపల తిట్టుకోవడం బయట చేతులేసుకుని తిరగడం
- ప్రజల కోసం మాట్లాడేవారు అసెంబ్లీలో ఒక్కరూ లేరని ఆరోపణ



**హైదరాబాద్, ప్రజానావ:** తాను ఎమ్మెల్యేగా అనవసరంగా గెలిచి అసెంబ్లీకి వచ్చానని బాధగా అనిపిస్తోందంటూ కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న తీరు బాధాకరంగా ఉందని పేర్కొన్నారు. లోపల ఒకరినొకరు తిట్టుకుని బయట మాత్రం చెట్టాపట్టాలేసుకుని తిరుగుతున్నారని విమర్శించారు. జిల్లా పరిషత్ చైర్మన్‌గా పనిచేసిన తనకు సభలో ఎలా వ్యవహరించాలో తెలుసని చెప్పారు. గతంలో అసెంబ్లీ మీదుగా వెళ్లేటప్పుడు ఎప్పుడెప్పుడు అసెంబ్లీకి వెళ్తానా అని అనుకునే వాడినని, ప్రజలకు ఎమ్మెల్యేలు మంచి చేస్తారని భావించేవాడినని గుర్తుచేసుకున్నారు. కానీ, కొందరు జీతాలు తీసుకుని కూడా అసెంబ్లీకి రావడం లేదని, మరికొందరు బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇద్దరు నాయకులు మాట్లాడితే మిగతా 60 మంది వారికి భజన చేస్తున్నారని దుయ్యబట్టారు. అసలు అసెంబ్లీలో ప్రజల గురించి మాట్లాడే నాయకులే లేరని, ప్రజా సమస్యల గురించి ప్రస్తావించాలన్న ఆలోచన కూడా వారికి ఉండడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల ఘోష నేతలకు వినపడడం లేదన్నారు. అంతమాత్రాన తానేం సత్యహరిశ్చంద్రుడిని కాదని చెప్పుకొచ్చారు.

## సరిహద్దు వెంట ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ

**సూర్యాపేట, ప్రజానావ:** పోలీస్ స్టేషన్‌ల పరిశీలనలో భాగంగా హుజూర్నగర్ సర్కిల్ పరిధిలో గల హుజూర్నగర్, మఠంపల్లి, గరిడేపల్లి, నేర్డుచర్ల పీఎస్ లను జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఐపీఎస్ పరిశీలించారు. పోలీస్ స్టేషన్ల నందు పరిసరాలు పరిశీలించారు, పోలీస్ స్టేషన్ పరిధిలో నేర ప్రవృత్తి తెలుపు మ్యాపులు, మండల భౌగోళిక స్థితిగతులు, సరిహద్దు పరిస్థితులు, హిస్టరీ షీట్స్ గురించి అయా పోలీస్ స్టేషన్ అధికారులను అడిగారు. స్టేషన్ నం దు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, సిబ్బందిని సమర్థవంతంగా ఉపయోగించాలని అన్నారు. డయల్ 100 పిర్యాదులపై వేగంగా స్పందించాలని ఆదేశించారు. హుజూర్నగర్ సర్కిల్ కు ఆంధ్రా సరిహద్దు ప్రాంతం, కృష్ణా బేసిన్ ఎక్కువగా ఉన్నది ఎల్లప్పుడూ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. మఠంపల్లి చెక్ పోస్ట్ వద్ద వాహనాలు క్షుణ్ణంగా తనిఖీలు చేయాలని అక్రమ రవాణా అడ్డుకోవాలని సూచించారు. అధికారులు సమన్వయంతో పని చేయాలి, నేరాల నివారణ, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణలో సమాచారం ఒకరికొకరు చేరవేసుకుని టీమ్ వర్క్ చేయాలని కోరారు. డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు, కార్డన్ అండ్ సెర్చ్ లు నిర్వహించాలి ఆదేశించారు. పోలీసు స్టేషన్ కు వచ్చే ప్రతి పిర్యాదుదారులకు కనీస సౌకర్యాలు కల్పించి, వారితో మర్యాదగా ప్రవర్తించి సహకారాలు అందించాలని సూచించారు.

# పుష్ప-2 ఆలస్యం అయినా.. అంచనాలు మించుతుంది

## నటుడు అల్లు శిరీష్ ఆసక్తికర కామెంట్స్

పుష్ప-2 ఆసల్యం అయినా ప్రేక్షకుల అంచనాలను మాత్రం అందుకుంటుందని అల్లు శిరీష్ కామెంట్ చేశారు. తన సోదరుడు, నటుడు అల్లు అర్జున్ హీరోగా నటిస్తోన్న 'పుష్ప 2' పై నటుడు అల్లు శిరీష్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'పుష్ప 2' విడుదల ఆలస్యం కానుందంటూ జరుగుతోన్న ప్రచారంపై 'బడ్డీ' ప్రమోషన్స్‌లో స్పందించారు. సినిమా ఎప్పుడు వచ్చినా అభిమానుల అంచనాలను తప్పకుండా అందుకుంటుందన్నారు. 'పుష్ప 2'పై మీ ఉత్సాహాన్ని ఇలాగే కొనసాగించండి. డిసెంబర్ 6వ తేదీ లేదా ఎప్పుడు వచ్చినా ఆ సినిమా తప్పకుండా మీ అంచనాలు అందుకుంటుంది. ఇది మా అన్నయ్య సినిమా అని నేను ఈ విషయాన్ని చెప్పడం లేదు. సుకుమార్ చాలా అద్భుతంగా దీనిని చెక్కుతున్నారని ఫిల్మ్‌నగర్‌లో మాట్లాడుకుంటుంటే అది నావరకూ వచ్చింది. దానినే మీతో పంచుకుంటున్నా' అంటూ అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపారు. అల్లు అర్జున్ హీరోగా తెరకెక్కిన యాక్షన్ డ్రామా మూవీ 'పుష్ప ది రైజ్'. ఎర్రచందనం స్మగ్లింగ్ నేపథ్యంలో ఇది తెరకెక్కింది. సుకుమార్ దర్శకుడు. రష్మిక కథానాయిక. దీనికి కొనసాగింపుగా 'పుష్ప ది రూల్' సిద్ధమవుతోంది. ఇప్పటికే విడుదలైన పాటలు, ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాలు పెంచేశాయి. తొలుత దీనిని ఆగస్టు 15న విడుదల చేస్తామని చిత్రబృందం ప్రకటించినప్పటికీ.. కొన్ని అనివార్య కారణాల వల్ల డిసెంబర్ ఆరో తేదీకి వాయిదా వేశారు. మరోవైపు, 'ఊర్వశివో రాక్షసివో' తర్వాత అల్లు శిరీష్ నటించిన చిత్రం 'బడ్డీ'. స్టూడియో గ్రీన్ పతాకంపై తెరకెక్కింది. గాయత్రి భరద్వాజ్, గోకుల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. సామ్ ఆంటోన్ దర్శకత్వం వహించగా.. కె.ఇ.జ్ఞానవేల్ రాజా నిర్మించారు. ఆగస్టు 2న విడుదల కానుంది. తెలుగు రాష్ట్రాల్లోని పలు నగరాల్లో ఇప్పటికే ప్రీమియర్స్ వేయగా మంచి టాక్ లభించింది.





# జంధ్యాల మార్క్.. మారుతీనగర్ సుబ్రమణ్యం




దర్శకుడు లక్ష్మణ్ కార్య ఇంతకు ముందు 'హ్యాపీ వెడ్డింగ్' అనే సినిమాకి దర్శకత్వం వహించాడు. అయితే ఆ సినిమా ఆశించినంతగా నడవలేదు, కానీ లక్ష్మణ్ కార్య దర్శకత్వ పటిమ ఏంటో ఆ సినిమా ద్వారా తెలిసింది. అందుకే ఇప్పుడు రెండో సినిమాగా 'మారుతీనగర్ సుబ్రమణ్యం'తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాడు. ఈ సినిమాకి లక్ష్మణ్ కార్య దర్శకత్వంతో పాటు, రచన, మాటలు, స్క్రీన్ ప్లే కూడా అందించారు. ఈ సినిమా త్వరలోనే విడుదలవుతుందని తెలుస్తోంది. అయితే ఈ సినిమా గురించి పరిశ్రమలో ఒక టాక్ బయలుదేరింది. అదేంటంటే ఈ సినిమాని ఇప్పటికే కొంతమంది పరిశ్రమలోని వారు చూసారని, ఈ సినిమా చూసిన తరువాత నవ్వకుండా ఉండలేరు అని అంటున్నారు. ఈ సినిమాలో రావు రమేష్ ప్రధాన పాత్ర పోషించారు. మామూలుగానే ప్రేక్షకులు ఒక సినిమాలో క్యారెక్టర్ పాత్రలో కనపడే రావు రమేష్ చెప్పిన మాటలని ఎంతో ఆస్వాదిస్తారు, అలాంటిది ఇప్పుడు అయన ప్రధాన పాత్రలో చేస్తున్న సినిమాలో అతని చెప్పే మాటలకి పడి పడి నవ్వాల్సిందే అని ఈ సినిమా చూసిన వాళ్ళు చెపుతున్నారు. ఇంకొక ఆసక్తికర అంశం ఏంటంటే ఈ సినిమాని ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీస్ మేకర్స్ కూడా చూసారని, అందుకే వాళ్ళు ఈ సినిమాని టేక్ అప్ చేసారని ఒక వార్త నడుస్తోంది. అలాగే ఈ సినిమా ప్రముఖ దర్శకుడు సుకుమార్ కూడా చూసి ఎంతో ఆస్వాదించారని తెలుస్తోంది. ఇందులో రావు రమేష్ లాంటి నటుడికి ఒక ఫుల్ లెంగ్త్ రోల్ ఇస్తే తన మాటలతో ఎలా ప్రేక్షకులని మంత్రం ముగ్దుల్ని చేస్తాడో ఈ సినిమా నిరూపిస్తుంది అని కూడా అంటున్నారు. హింసాత్మక సినిమాలతో ప్రేక్షకుడికి ఊపిరి ఆడక ఉన్నటువంటి ఈ సమయంలో ఈ 'మారుతీనగర్ సుబ్రమణ్యం' ప్రాణవాయువు లాంటిదని అంటున్నారు. 'ఇది ఒక జంధ్యాల మార్కు సినిమాలా ఉంటుంది' అని ఈ సినిమా చూసిన వ్యక్తులు అంటున్నారు. దర్శకుడు జంధ్యాల సునిశితమైన హాస్యంతో తనదైన శైలితో ప్రేక్షకులను తన సినిమాలతో కడుపుబ్బా నవ్వించేవారు, ఇప్పుడు అలాంటి సినిమాలు కరువయ్యాయి, కానీ ఈ 'మారుతీనగర్ సుబ్రమణ్యం' సినిమాతో ఆ కరువు తీరిపోతుంది అని అంటున్నారు. అలాగే ఇంత వరకు క్యారెక్టర్ పాత్రలు వేస్తూ వచ్చిన రావు రమేష్ ఈ సినిమాతో ప్రధానపాత్రలో కనపడుతున్నారు. మధ్య తరగతి కుటుంబాలకి చెందిన కథలు ఈమధ్య రావటం మానేశాయి, ఈ 'మారుతీనగర్ సుబ్రమణ్యం' తో అటువంటి సినిమాలకి శ్రీకారం జరుగుతుందని పరిశ్రమలో అనుకుంటున్నారు. ఇప్పటికే ఈ సినిమా ప్రచార చిత్రాలు అందరినీ అలరించాయి, ట్రేండింగ్ కూడా అయ్యాయి. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా ఆగస్టు మూడో వారంలో విడుదల కావచ్చు అని అంటున్నారు.

# గూఢాచారి సీక్వెల్‌గా జి2

టాలీవుడ్ హిస్టరీలో ల్యాండ్ మార్క్‌గా నిలిచిపోయే సినిమాల జాబితాలో ముందు వరుసలో ఉంటుంది గూఢచారి. అడివిశేష్ టైటిల్ రోల్ పోషించిన ఈ మూవీ బాక్సాఫీస్‌ను షేక్ చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఇదే ఫ్రాంచైజీలో ఈ చిత్రానికి కొనసాగింపుగా జీ2కూడా వస్తుందని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. మేజర్ సినిమాకు ఎడిటర్‌గా పనిచేసిన వినయ్ కుమార్ సిరిగినీడి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నాడు. కాగా గన్స్ యాక్షన్ మూడ్‌లోకి దిగితే.. అంటూ డైరెక్టర్ వినయ్ కుమార్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు మేకర్స్. వినయ్ కుమార్ చేతిలో పిస్తోల్ పట్టుకున్న తాజా స్టిల్ నెట్టింట వైరల్ అవుతోంది. ఇప్పటికే విడుదల చేసిన జీ2 (ఉ2) ఫస్ట్ లుక్ పోస్టర్‌తోపాటు ప్రీ వెర్షన్ అనౌన్స్ మెంట్ వీడియో సినిమాపై సూపర్ క్యూరియాసిటీ పెంచుతోంది. షూటింగ్ కొనసాగుతున్నట్టు తెలియజేశారు. అడివి శేష్ ఈ మూవీలో మరోసారి స్టైలిష్ యాక్షన్ అవతార్‌లో కనిపించబోతున్నట్టు ప్రీ వెర్షన్ అనౌన్స్ మెంట్ వీడియోతో క్లారిటీ ఇచ్చేశాడు డైరెక్టర్. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా జీ2 చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాయి. యాక్షన్ థ్రిల్లర్ జోనర్‌లో తెరకెక్కుతున్న ఈ మూవీకి శ్రీచరణ్ పాకాల సంగీతం అందిస్తున్నాడు. జీ2 తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో గ్రాండ్ విడుదల కానుంది.





# సీక్వెల్స్ రకుల్‌కు కలిసి రావడం లేదా..?

టాలీవుడ్ లో స్టార్ హీరోయిన్ గా ఎదిగింది ముద్దుగుమ్మ రకుల్ ప్రీత్ సింగ్. సందీప్ కిషన్ హీరోగా నటించిన వెంకటాద్రి ఎక్స్ ప్రెస్ తో మంచి గుర్తింపు తెచ్చుకుంది రకుల్. ఆతర్వాత వరుసగా తెలుగులో ఆఫర్స్ అందుకుంది. టాలీవుడ్ లో స్టార్ హీరోయిన్ గా ఎదిగింది ముద్దుగుమ్మ రకుల్ ప్రీత్ సింగ్. సందీప్ కిషన్ హీరోగా నటించిన వెంకటాద్రి ఎక్స్ ప్రెస్ తో మంచి గుర్తింపు తెచ్చుకుంది రకుల్. ఆతర్వాత వరుసగా తెలుగులో ఆఫర్స్ అందుకుంది. తెలుగులో బ్యాక్ టు బ్యాక్ లు చేస్తూ.. తక్కువ సమయంలోనే స్టార్ హీరోయిన్ గా మారింది రకుల్ ప్రీత్ సింగ్. ఈ అమ్మడి తెలుగులో దాదాపు అందరు స్టార్ హీరోలు, యంగ్ హీరోల సరసన లు చేసి అలరించింది. తెలుగుతో పాటే తమిళ్ లోనూ అవకాశాలు అందుకుంది. అక్కడ కూడా స్టార్ హీరోలతో జతకట్టింది ఈ వయ్యారి భామ. . తెలుగులో కొండపోలం తర్వాత మరో లో నటించలేదు. రీసెంట్ గా భారతీయుడు 2 లో మెరిసింది. రకుల్ ప్రీత్ సింగ్ హిందీ యువ నిర్మాత, నటుడు జాకీ భగ్నానీని పెళ్లి చేసుకుంది. వీరి పెళ్లి ఫిబ్రవరి 21న గోవాలో ఓ ఫైవ్ స్టార్ హెూటల్‌లో భారీగా జరిగింది. పెళ్లి తర్వాత ల స్పీడ్ తగ్గించింది ఈ బ్యూటీ. ఇదిలా ఉంటే తాజాగా సోషల్ మీడియాలో ఓ వార్త వైరల్ అవుతుంది. రకుల్ కు సీక్వెల్స్ కలిసి రావడం లేదు అని అంటున్నారు. రవితేజ నటించిన కిక్ 2, నాగార్జున నటించిన మన్మధుడు 2, రీసెంట్ గా భారతీయుడు 2 ఈ మూడు ల్లో రకుల్ హీరోయిన్ గా చేసింది. మూడు లు ప్రేక్షకులను నిరాశపరిచాయి.




# యువతకు కాగడా అందించే తరుణం

**• అధ్యక్ష బరినుంచి తప్పకోవడంపై బైడెన్ వివరణ**
**• దేశం కోసమే తన నిర్ణమని వివరణ**

**వాషింగ్టన్, జూలై 25 :** అమెరికా అధ్యక్ష ఎన్నికలు-2024 రేసు నుంచి తప్పుకుంటున్నట్టు ప్రకటించిన అనంతరం ప్రెసిడెంట్ జో బిడెన్ తొలిసారి బుధవారం స్పందించారు. అమెరికా మార్గదర్శకత్వాన్ని యువతరానికి అందిస్తున్నానంటూ ఆయన వ్యాఖ్యానించారు. యువ గళాలకు కాగడాను అందించాల్సిన తరుణం ఆసన్నమైందని ఆయన అన్నారు. ఈ మేరకు అమెరికన్లను ఉద్దేశించి 'ఓవల్ ఆఫీస్' నుంచి ఆయన చారిత్రాత్మకమైన ప్రసంగం చేశారు. డెమొక్రాటిక్ పార్టీని, దేశాన్ని ఏకం చేసేందుకే తాను 2024 ఎన్నికల నుంచి వైదొలగుతున్నట్టు ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. ప్రజాస్వామ్యం సంరక్షణ అన్నింటి కంటే ముఖ్యమైనదని, నవతరానికి కాగడాను అందించడమే ఉత్తమ మార్గం అని తాను నిర్ణయించుకున్నానని, అమెరికాను ఐక్యం చేయడానికి అదే ఉత్తమ మార్గమని ఆయన అన్నారు. కష్టపడే సామర్థ్యం ఉన్న వైస్ ప్రెసిడెంట్ కమలా హారీస్ డెమొక్రాటిక్ పార్టీ ప్రెసిడెన్షియల్ నామినీగా ఎంపికయ్యారని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. డొనాల్డ్ ట్రంప్‌తో పోల్ డిబేట్‌లో జో బైడెన్ వెనుకబడడం, ఆ తర్వాత ట్రంప్‌పై హత్యాయత్నం నేపథ్యంలో ఎన్నికల రేసు నుంచి తప్పుకోవాలంటూ డెమొక్రాటిక్ శ్రేణులు బైడెన్‌పై తీవ్రమైన ఒత్తిడి తీసుకొచ్చాయి. దాదాపు రెండు వారాల తర్వాత ఆయన రేసు నుంచి వైదొలిగారు. దీంతో భారతీయ మూలాలు ఉన్న కమలా హ్యారీస్ రేసులోకి వచ్చిన విషయం తెలిసిందే. అమెరికా రాజకీయాల్లో ప్రతీకారాలకు ముగింపు పలకాలని, దేశం కంటే ఏ నియంతృత్వం, నిరంకుశం ఎక్కువ కాదు అంటూ బైడెన్ పవర్ ఫుల్ ప్రసంగం ఇచ్చారు. యువ గళాలకు, సరికొత్త నేతలకు సమయం సమయం ఆసన్నమైందని, ఆ సమయం ఇదేనని అన్నారు. కాగా జీవితంలో అత్యంత కీలక ప్రసంగం చేస్తున్న సమయంలో ఆయన కుటుంబ సభ్యులు ఓవల్ కార్యాలయంలో ఆయన ముందు కూర్చొని విన్నారు. ఆయనకు సపోర్టుగా అక్కడే ఉన్నారు. భార్య జిల్ బైడెన్, కూతురు యాష్లే, కొడుకు హంటర్ ఉన్నారు. ప్రసంగం ముగిసిన తర్వాత ఆయన వద్దకు వెళ్లి ఆప్యాయంగా చేతులు పట్టుకున్నారు. బిడెన్ మనవరాళ్లు కూడా ఓవల్ ఆఫీస్‌కు వచ్చారు. అధ్యక్షుడు జో బైడెన్ ప్రసంగంపై రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష నామినీ డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. వండి వార్చిన జో బిడెన్ ఓవల్ ఆఫీస్ ప్రసంగం అర్థమైంది. చాలా చెడ్డగా ఉందని ట్రంప్ అన్నారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా స్పందించారు. కాగా అధ్యక్ష ఎన్నికలకు ఫిట్ కాని వ్యక్తి అధ్యక్షుడిగా మాత్రం ఎలా కొనసాగుతారని, వైగొలగాలంటూ రిపబ్లికన్ పార్టీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. అధ్యక్షుడిగా పనిచేయడానికి ఆయన తగినవాడు కాదని అంటున్నారు. విమర్శలకు జో బైడెన్ సమాధానం ఇచ్చారు. తాను కుంటివాడిని కాదని, పదవిలో ఉన్నంత కాలం ఆర్థిక వ్యవస్థ, కీలకమైన విదేశాంగ విధాన సమస్యలపై పని చేస్తూనే ఉంటానని స్పష్టం చేశారు. రాబోయే ఆరు నెలల్లో తాను అధ్యక్షుడిగా పని చేయడంపై దృష్టి పెడతానని చెప్పారు.కాగా బిడెన్ లేకుండానే అమెరికా ఎన్నికల ప్రచారం జరుగుతోంది. డెమొక్రాటిక్ పార్టీ నామినీగా కమలా హ్యారీస్‌కు పార్టీ ప్రతినిధుల మద్దతు లభిస్తుండడంతో ఆమె ప్రచారంలో దూసుకెళ్తున్నారు.

# రాష్ట్ర ప్రయోజనాల కోసం ఉమ్మడి పోరాటం

**• రాజకీయాలకు అతీతంగా కలసి నడవాల్సిందే**
**• తెలంగాణ అభివృద్ధి ఎజెండగా ముందుకు సాగాలి**



**హైదరాబాద్ బ్యూరో, ప్రజానావ:** ప్రజా ప్రయోజనాల కోసం అంతా కలసికట్టుగా పోరాడుదా మని అసెంబ్లీలో తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపు జ్ఞానోదయం కావాలి. తమిళనాడు లాగా ప్రయోజనాల విషయంలో కలసికట్టుగా పోరాడాలి. రాజకీయ విబేదాలను పక్కన పెట్టి పోరాడాలి. ఇప్పటికైనా తెలంగాణ బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాడాలి. రాజకీయాల కతీతంగా, జీ హుజూర్ రాజకీయాలు పక్కన పెట్టి, రాష్ట్ర అవసరాల కోసం స్వార్థంతో పట్టుదలగా కృషి చేయాలి. అప్పుడే రాష్ట్రానికి న్యాయం జరుగుతుంది. నిధుల కేటాయింపులు జరుగుతాయి. ఈ బడ్జెట్ తెలంగాణను విస్మరించిందన్న విసయాన్ని ముందుగా అన్ని పార్టీలో రాజకీయాలకు అతీతంగా అంగీకరించాల్సిందే. తెలంగాణకు సంబంధించి ప్రత్యేక కేటాయింపుల విషయంలో పూర్తిగా నిరాశ కల్పించింద నడంలో సందేహం లేదు. ఏపీకి అదనంగా నిధులు ఇచ్చినందుకు అభ్యంతరం లేదు. ఎపిని ఆదుకోవాల్సిందే. అదే సందర్భంలో తెలంగాణను కూడా ఆదుకోవాల్సిందే. విలీన మండలాలపైనా ఎలాంటి ప్రతిపాదనా ప్రకటించలేదు. బడ్జెట్ సందర్భంగా ఏపీకి చెందిన కేందరమంత్రి రామ్మోహన్ నాయుడు, ఇతర ఎంపీలు వాళ్ళ రాష్ట్రానికి వచ్చిన కేటాయింపులు చంద్రబాబునాయుడు సమర్థతో తెచ్చారని చెప్పుకుంటున్నారు. తెలంగాణ ప్రజలు కూడా ఈ రాష్ట్రానికి సంబంధించి కేంద్రమంత్రులు, అధికార పార్టీ ఎంపీలు మాట్లాడాలని కోరుకోగలగాలి. మేమంతా సమర్థంగా సమిష్టిగా పోరాడి నిధులు తెచ్చుకోగలిగామని చెప్పుకోవాలి. బండి సంజయ్ ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటనా చేయలేదు. కేటాయింపుల్లో అన్యాయం గురించి ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ తరహాలో బిజెపి కూడా తమ విధానం ప్రకటించాలి. తెలంగాణ వారిగా మనమంతా ప్రశ్నించాల్సిందే. పెదవి విప్పక పోతే నష్టం జరుగుతూనే ఉంటుంది. రాష్ట్ర ప్రయోజనాలను, ప్రత్యేకించి రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు దాటినందున హామీలపై పోరాడాల్సిందే. కేంద్రమంత్రివర్గంలో ప్రాతినిధ్యం ఉండి కూడా, ఈసారి తెలంగాణ నుంచి బీజేపీకి ఎన్నడూ లేనంత ఆదరణ దొరికినా కూడా కేంద్రమంత్రులు, ఎంపిలు మాట్లాడకపోవడం తెలంగాణ ప్రజలను అవమానించడం తప్ప మరోటి కాదు. ఎనిమిదిమంది ఎంపీలను గెలిపించిన ప్రజలు గర్వపడేలా ఎంపీలు ప్రత్యేకంగా తమ రాష్ట్రానికి ఏమైనా సాధించారో చెప్పడలగాలి. రాజ్యాంగబద్ధంగా రావాల్సిన పన్నుల్లో వాటా రావడం వేరు. కేంద్ర ప్రాయోజిత పథకాలు ఎవరున్నా లేకున్నా వస్తాయి. కానీ కేటాయింపుల్లో మాత్రం పోరాడాల్సిందే. కేంద్ర వ్యవహారశైలి, తెలంగాణ పట్ల వారి వైఖరి ఈ ఒక్క బడ్జెట్‌తో స్పష్టం అయ్యింది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రంతో సఖ్యత నెరపలేదని అంటున్న వారు.. ఇప్పుడు రేవంత్ రెడ్డి సఖ్యతగా ఉన్నా ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారో కిషన్ రెడ్డి లాంటి వారు చెప్పాలి. సిఎం, మంత్రులు కలసికట్టుగా పలువరు వినతిపత్రాలు సమర్పించినా లాభం లేకుండా పోయింది. అందుకే ఇప్పుడు కేంద్రంపై పోరాటంలో రాజకీయాలు అతీతంగా కలిసి రావాలని సిఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన పిలుపు సరైనదిగానే భావించాలి. రేవంత్‌రెడ్డి ఇప్పుడు దక్షిణాది ప్రస్తావన తెచ్చి, మిగతా రాష్ట్రాలకు జరుగుతున్న విసయాన్ని దేశం దృష్టికి తెచ్చారు. ఇవన్నీ ఇలావుంటే ఘనంగా చెప్పుకుంటున్న బడ్జెట్ ద్వారా ద్రవ్యోల్బణం గురించి చర్చించలేదు. వికసిత భారత్‌లో ప్రతిరోజూ ఆకాశాన్ని అంటుతున్న నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించే ప్రయత్నాలపై మాట్లాడలేదు. మొత్తంగా రాష్ట్ర ప్రయోజాల విషయంలో అంతా ఒక్కటే అన్న నినాదం రావాలి. కాలసి పోరాడాలి. అప్పుడే మన ప్రయోజనాలు నెరవేరుతాయి.

## ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక తల్లీ కుమారుడు ఆత్మహత్య

**హైదరాబాద్, ప్రజానావ:** ఆర్థిక ఇబ్బందులతో తల్లీకుమారుడు ఆత్మహత్యకు పాల్పడ్డారు. నగరంలోని చైతన్యపురి పీఎస్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. కొత్తపేటలోని ఎస్ఆర్ కాలనీలో తల్లి గంజి పద్మ (40), కుమారుడు వంశీ (18) అద్దె ఇంట్లో నివాసముంటున్నారు. పద్మ భర్త శివ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆమె కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. ఆర్థిక ఇబ్బందులతో బుధవారం రాత్రి పద్మ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. తల్లి మృతిని తట్టుకోలేక కుమారుడు వంశీ కూడా ఉరివేసుకుని చనిపోయాడు. సమాచారం అందుకున్న చైతన్యపురి పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి మృతదేహాలను ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఏపీలోని ఒంగోలుకు చెందిన వీరి కుటుంబం కొన్నేళ్లుగా ఎస్ఆర్ కాలనీలో ఉంటోంది.

## అటవీ సంపదను పునరుద్ధరించుకో వాలి

**ప్రతి ఒక్కరూ కనీసం 20 మొక్కలు నాటాలి**

**నిజామాబాద్, ప్రజానావ:** రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం ప్రకారం పచ్చదనాన్ని 33 శాతానికి చేరాలంటే జిల్లాలో ప్రతి ఒక్కరూ 20 మొక్కలు నాటాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. అటవీ శాఖ అధికారుల నిర్లక్ష్యం మూలంగా చాలా చోట్ల అడవి తగ్గిపోయింది. పచ్చదనం కాస్తా కనుమరుగై మైదానాలను తలపిస్తోంది. కామారెడ్డి జిల్లా అంటే ఒకప్పుడు సువిశాల అటవీ ప్రాంతం ఇప్పుడు కాస్తా అడవి హరించుకుపోవడంతో వర్షాలు లేక ఏటా అక్కడక్కడ అల్ప వర్షాపాతం సైతం నమోదు అవుతోంది. అటవీ సంపదను పునరుద్ధరించి ఇలాంటి పరిస్థితులను అధిగమించడానికి ప్రభుత్వం మొక్కలు పెంచే వన సంరక్షణ పథకాన్ని అమలు చేస్తోంది. ఏటా లక్షలాది మొక్కలను నాటుతూ పల్లెల్లో పచ్చదనం వెల్లివిరిసేలా చూస్తోంది. జిల్లాలో ఇప్పటి వరకు దాదాపుగా నాలుగు కోట్ల మొక్కలు నాటారు. ఈసారి వ ర్షాలు అంచనాలకు తగ్గట్లుగా కురిస్తే నాటిన మొక్క ల్లో 70నుంచి 80శాతం మొక్కలు బతికే వీలుంది. ఈసారి భారీగా మొక్కలు నాటేందుకు నర్సరీల్లో మొక్కల పెంపకాన్ని ప్రభుత్వం భారీగా చేపట్టింది. గ్రామాలు, పట్టణాల్లో చైతన్యవం తులైన ప్రజలు మొక్కలు నాటే హరితయజ్ఞంలో భాగ స్వాములైతే హరిత సంకల్పం నెరవేరినట్లేనని అధికా రులు భావిస్తున్నారు. టేకు మొక్కలతో పాటు వివిధ రకాల పూలు, పండ్ల మొక్కలు, యూకలిప్టస్, కానుగ, వేప, జామాయిల్ మొక్కలు కొద్ది రోజు ల్లోనే నాటేందుకు సిద్ధం కానున్నాయి. గత హరితహారంలో మొక్కలు నాటడంలో కొన్ని శాఖలు విఫలం అయ్యాయనే ఆరోపణలు ఉన్నాయి. ఈసారి మా త్రం అలాంటివి పునరావృతం కాకుండా పటిష్టవంతమైన చర్యలు తీసుకుంటున్నారు. నాటిన మొక్కలను బతికిం చుకునేందుకు ప్రభుత్వం ఈసారి ప్రత్యేకంగా దృష్టి సారించింది. వానలు సంవృద్ధిగా కురిస్తున్నందున నాటి న మొక్కలకు జీవం పోసే విధంగా చర్యలు తీసు కోవాలని ఆదేశాలు వచ్చాయి.

## లారీని ఢీకొన్న బైక్.. ముగ్గురు యువకుల దుర్మరణం

**సంగారెడ్డి, జూలై 25 :** సంగారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కంది మండలం తునికిళ్ల తండా శివారులో జరిగిన ప్రమాదంలో ముగ్గురు యువకులు దుర్మరణం పాలయ్యారు. నాందేడ్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న లారీని వెనుక నుంచి ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులు అక్కడికక్కడే చనిపోయారు. మృతులను పుల్కల్ మండలం గంగోజీపేటకు చెందిన సందీప్, నవీన్, అభిషేక్‌గా గుర్తించారు. ఈ ముగ్గురూ అక్షయపాత్రలో డెలివరీ బాయ్స్‌గా పని చేసేందుకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగిందని గుర్తించారు. పోలీసులు వెంటనే చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

# స్థూలకాయంతో గుండెపై ప్రభావం

**ఆహారపు అలవాట్లు మార్చుకోవాల్సిందే**

**న్యూఢిల్లీ, జూలై 25 :** స్థూలకాయాన్ని వ్యాధిగా పరిగణించాలి. దీని ప్రభావం గుండెపై ఉంటుంది. గుండెపై కొవ్వు పేరుకుపోవడం వల్ల గుండె పనితీరుపై తీవ్ర ప్రభావం పడుతుంది. అటువంటి పరిస్థితిలో స్ట్రోక్ వచ్చే ప్రమాదం ఉంది. అంతేకాదు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడతారు. గుండె ఆరోగ్యం దెబ్బ తింటే శ్వాస వ్యవస్థ పాడై, శ్వాస పీల్చుకోవడంలో అనేక ఇబ్బందులు పడతారు. గుండె చుట్టూ కొవ్వు పేరుకుపోవడం వల్ల ధమనుల్లో ఇబ్బందులు ఏర్పడతాయి. స్థూలకాయం వలన శరీరం బరువు పెరగడంతో కీళ్ల నొప్పులతో ఇబ్బందులు పడతారు. బరువులు ఎత్తినప్పుడు కీళ్లలో నొప్పి మొదలవుతుంది. శరీర బరువు మరింత పెరిగితే, అప్పుడు కీళ్ళపై భారం పడుతోంది. కీళ్లు, పాదాల ఆరోగ్యం చెడిపోకుండా మొదటి నుంచి బరువు అదుపులో ఉంచుకోవాలి.శరీర కొవ్వును ఖచ్చితంగా కొలవడం చాలా కష్టం. బాడీ మాస్ ఇండెక్స్ (బి.ఎం.ఐ) ఆరోగ్యకరమైన బరువును నిర్ణయించడానికి ఒక ప్రసిద్ధమైన మార్గం. భారతదేశంలో బి.ఎం.ఐ 23 కంటే ఎక్కువ ఉంటే, అప్పుడు అధిక బరువుగా పరిగణిస్తారు. అయితే బి.ఎం.ఐ స్థాయి 30 కంటే ఎక్కువ ఉంటే అప్పుడు ఆ పరిస్థితిని ఊబకాయం అంటారు. ఈ స్థూలకాయాన్ని తేలికగా తీసుకోవడం వల్ల అనేక వ్యాధులకు గురవుతారు. వివిధ వ్యాధుల బారినపడే ప్రమాదాన్ని పెంచుతుందని హెచ్చరిస్తారు. శరీరంలోని ముఖ్యమైన అవయవాలు కిడ్నీ, కాలేయంలో కొవ్వు పేరుకుపోయి తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉంది. ఈ కొవ్వు ఒక రకమైన ఒత్తిడిని సృష్టిస్తుంది. ఈ కారణంగా కిడ్నీ, కాలేయం పనితీరుపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఈ అవయవాలు సరిగా పనిచేయలేవు. కొవ్వు పట్టిన కాలేయానికి తగిన చికిత్స చేయకపోతే కాలేయం విఫలమై ప్రాణాంతక పరిస్థితికి దారి తీస్తుంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం ఊబకాయం ఉన్నవారిలో తక్కువ స్పెర్మ్ ఉత్పత్తి అవుతుంది. పెరిగిన శరీరం. చక్కెర అధికంగా ఉత్పత్తి చేస్తూ మధుమేహం ప్రమాదాన్ని కూడా పెంచుతుంది. అందుకే పిల్లల్ని సాధ్యమైనంతవరకు ఆటల వైపు దృష్టి మళ్లించాలి. పెద్దవాళ్లు వ్యాయామం అలవాటు చేసుకోవాలి.



www.prajanaava.in
హైదరాబాద్
శుక్రవారం, జులై 26, 2024
ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..

# ఆర్చరీలో అదరహో

- క్వార్టర్ ఫైనల్‌లో భారత జట్లు
- పారిస్ ఒలింపిక్స్‌లో కళ్లు చెదిరే ఆరంభం




**పారిస్:** ఫ్రాన్స్ రాజధాని పారిస్ వేదికగా జరుగుతున్న విశ్వ క్రీడలు (ఒలింపిక్స్)లో భారత్ క్రీడల ఆరంభానికి ముందే అదరగొట్టింది. గురువారం జరిగిన ఆర్చరీ పోటీల్లో భారత పురుషులు, మహిళల జట్లు క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నాయి. పురుషుల ర్యాంకింగ్ రౌండ్‌లో భారత్ 2013 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి క్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను సొంతం చేసుకుది. భారత్ విజయంలో విజయవాడ ఆర్చర్ బొమ్మదేవర ధీరజ్ కీలక పాత్ర పోషించాడు. ధీరజ్ అసాధారణ ప్రతిభను



కనబరిచాడు. 681 పాయింట్లతో వ్యక్తిగత రౌండ్‌లో నాలుగో స్థానాన్ని దక్కించుకున్నాడు. తరుణ్‌దీప్ రాయ్ 674 పాయింట్లు సాధించి తనవంతు పాత్ర పోషించాడు. ప్రవీణ్ జాదవ్ 658 పాయింట్లు సాధించి సత్తా చాటాడు. మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత్ 1347 పాయింట్లు సాధించి రౌండ్ ఆఫ్16లోకి ప్రవేశించింది. టాప్‌లో నిలిచిన ధీరజ్, అంతిక భకత్ భారత్ తరఫున బరిలోకి దిగనున్నారు. అంతకుముందు మహిళల టీమ్ విభాగంలో కూడా భారత్ క్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను దక్కించుకుంది. గురువారం జరిగిన క్వాలిఫికేషన్ రౌండ్‌లో భారత్ నాలుగో స్థానంలో నిలిచి నేరుగా క్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను సాధించింది. భారత్ టీమ్ ఈవెంట్‌లో 1983 పాయింట్లను సాధించింది. అంకిత భకత్ (666), భజన్ కౌర్ (658), దీపిక కుమార్ (658) పాయింట్లు సాధించి భారత్ విజయంలో కీలక పాత్ర పోషించారు.

# సమరోత్సాహంతో భారత్




- నేడు బంగ్లాదేశ్‌తో సెమీస్ పోరు
- మహిళల ఆసియా కప్

**దంబుల్లా:** ప్రతిష్ఠాత్మకమైన మహిళల ఆసియా కప్ సెమీ ఫైనల్ సమరానికి సర్వం సిద్ధమైంది. శుక్రవారం మధ్యాహ్నం జరిగే తొలి సెమీస్‌లో బంగ్లాదేశ్‌తో టీమిండియా తలపడనుంది. రాత్రి జరిగే రెండో సెమీస్‌లో ఆతిథ్య శ్రీలంకతో పాకిస్థాన్ పోటీ పడుతుంది. గ్రూప్‌ఎలో ఆడిన మూడు మ్యాచుల్లోనూ గెలిచిన భారత్ సెమీస్‌కు దూసుకొచ్చింది. సెమీస్ చేరే క్రమంలో పాకిస్థాన్, యుఎఇ, నేపాల్ జట్లను ఓడించింది. ఇక బంగ్లాదేశ్ మూడింటిలో రెండు మ్యాచుల్లో జయకేతనం ఎగుర వేసింది. శ్రీలంక చేతిలో ఓడిన బంగ్లాదేశ్ థాయిలాండ్, మలేసియా జట్లపై విజయం సాధించింది. ఇక బంగ్లాతో జరిగే సెమీస్ పోరులో భారత్ ఫేవరెట్‌గా కనిపిస్తోంది. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేసే క్రికెటర్లకు జట్టులో కొదవలేదు. ఓపెనర్లు స్మృతి మంధాన, షెఫాలీ వర్మలు ఫామ్‌లో ఉన్నారు. ఈ మ్యాచ్‌లో కూడా శుభారంభం అందించాలనే పట్టుదలతో కనిపిస్తున్నారు. ఎలాంటి బౌలింగ్‌నైనా చిన్నాభిన్నం చేసే సత్తా మంధాన, షెఫాలీలకు ఉంది. వీరు తమ మార్క్ బ్యాటింగ్‌తో చెలరేగితే ప్రత్యర్థి జట్టు బౌలర్లకు కష్టాలు ఖాయం. కొంతకాలంగా మంధాన మూడు ఫార్మాట్‌లలోనూ అత్యంత నిలకడైన బ్యాటింగ్‌ను కనబరుస్తోంది. బంగ్లాదేశ్‌తో జరిగే సెమీ ఫైనల్లోనూ చెలరేగాలనే పట్టుదలతో ఉంది. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేసే సత్తా కలిగిన మంధాన విజృంభిస్తే ఈ మ్యాచ్‌లో కూడా భారత్‌కు భారీ స్కోరు కష్టమేమీ కాదు. ఇక కెప్టెన్‌గా, బ్యాటర్‌గా జట్టును ముందుండి నడిపించాల్సిన బాధ్యత మంధానపై నెలకొంది. షెఫాలీ కూడా తన జోరును కొనసాగించక తప్పదు. షెఫాలీ ఫామ్‌లో ఉండడం భారత్‌కు కలిసివచ్చే అంశంగా చెప్పాలి. మరోవైపు హేమలత, జెమీమా రోడ్రిగ్స్, రిచా ఘోష్, దీప్తి శర్మ, సంజన తదితరులతో భారత బ్యాటింగ్ చాలా బలంగా ఉంది. వీరిలో ఏ ఇద్దరు నిలదొక్కుకున్నా భారత్‌కు మెరుగైన స్కోరు ఖాయమనే చెప్పాలి. బౌలింగ్‌లోనూ భారత్ చాలా బలంగా ఉంది. అరుంధతి రెడ్డి, రేణుకా సింగ్, దీప్తి శర్మ, రాధా యాదవ్, పూజా వస్త్రకర్ వంటి మ్యాచ్ విన్నర్ బౌలర్లు జట్టులో ఉన్నారు. టీమిండియా సాధించిన హ్యాట్రిక్ విజయాల్లో బౌలర్ల పాత్ర కూడా చాలా కీలకంగా ఉంది. ఇక సెమీస్‌లో కూడా బౌలర్లపై జట్టు భారీ ఆశలు పెట్టుకుంది.

### తక్కువ అంచనా వేయలేం..

కాగా, బంగ్లాదేశ్‌ను కూడా తక్కువ అంచనా వేయలేం. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో జట్టు సమతూకంగా ఉంది. ప్రతిభావంతైన ఆటగాళ్లకు జట్టులో కొదవలేదు. దిలారా అక్తర్, ముర్షిదా ఖాతున్, నిగర్ సుల్తానా, రుమానా అహ్మద్, రాబియా ఖాన్, నాహిదా అఖ్తర్ తదితరులతో బంగ్లాదేశ్ బలంగా కనిపిస్తోంది. మలేసియాతో జరిగిన కిందటి మ్యాచ్‌లో బంగ్లాదేశ్ భారీ విజయం సాధించింది. దీంతో భారత్‌తో పోరుకు సమరోత్సాహంతో సిద్ధమైంది.

# ఫ్రాంచైజీల గొంతెమ్మ కోరికలు..

### బీసీసీఐ ముందు 3 బిగ్ డిమాండ్‌లు




**ముంబై:** ఐపీఎల్ 2025 మెగా వేలానికి సన్నాహాలు ప్రారంభమయ్యాయి. ఈనెల 31న ఆక్షన్‌కు సంబంధించి ఫ్రాంచైజీలతో కీలక సమావేశాన్ని నిర్వహించనుంది బీసీసీఐ. ఈ నేపథ్యంలోనే ఐపీఎల్ మెగా వేలం నియమావళిలో కొన్ని మార్పులు చేయాలని ఫ్రాంచైజీలు బోర్డును అభ్యర్థించాయి. వాటిల్లో ఎక్కువ మంది ఫ్రాంచైజీల ఓనర్లు 3 బిగ్ డిమాండ్‌లు క్రికెట్ బోర్డు ముందు ఉంచినట్టు తెలుస్తోంది. ఐదేళ్లకు ఒకసారి ఐపీఎల్ మెగా వేలం నిర్వహించాలని చాలామంది ఫ్రాంచైజీల ఓనర్లు కోరుతున్నట్టు తెలుస్తోంది. గతంలో ప్రతి మూడేళ్లకోసారి మెగా వేలం నిర్వహించే వారు. ఈ నిబంధనను మార్చి.. ఐదేళ్లకొకసారి మెగా వేలం నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నాయి ఫ్రాంచైజీలు.


అంటే ఈసారి మెగా వేలం నిర్వహిస్తే తదుపరి మెగా వేలం 2029లో జరగాలి. మధ్యలో మినీ వేలం మాత్రమే నిర్వహించాలని వారు అంటున్నారు. మెగా వేలానికి ముందు 4 నుంచి 6 మంది ఆటగాళ్లను రిటైన్ చేసుకోవడానికి అనుమతించాలని ఫ్రాంచైజీలు అభ్యర్థించాయి. మునుపటి మెగా వేలంలో గరిష్టంగా 4 మంది ఆటగాళ్ల ను ఉంచుకునే అవకాశం ఉంది. ఈసారి ఆ సంఖ్యను 4 నుంచి 6కి పెంచాలని ఫ్రాంచైజీలు కోరుతున్నాయి.

# సీఎస్‌కే తరఫున ఆడాకే గుర్తింపు వచ్చింది..




**కొలంబో:** ఐపీఎల్ ఫ్రాంచైజీ చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) తరఫున ఆడాకే తనకు గుర్తింపు వచ్చిందని శ్రీలంక యువ పేసర్ మతీశా పతిరన తెలిపారు. చెన్నై తరఫున ఆడటం దేవుడిచ్చిన బహుమతిగా భావిస్తున్నా అని తెలిపాడు. క్రికెట్ దిగ్గజం ఎంఎస్ ధోనీతో డ్రెస్సింగ్ రూమ్ పంచుకోవడం తన అదృష్టం అని పతిరన పేర్కొన్నాడు. యువ మలింగగా గుర్తింపు పొందిన పతిరన.. చెన్నై తరఫున ఐపీఎల్‌లోకి అడుగుపెట్టాడు. అనతికాలంలోనే సీఎస్‌కే కీలక బౌలర్‌గా ఎదిగాడు. దీంతో అతడికి శ్రీలంక టీమ్‌లో చోటు దక్కింది. టీ20 ప్రపంచకప్ 2024లో పతిరన ఫర్వాలేదనిపించాడు. భారత్‌తో మూడు టీ20ల సిరీస్ కోసం మతీశా పతిరన సిద్ధమవుతున్నాడు. ఈ సందర్భంగా ఐపీఎల్‌లో ఆడటంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'అండర్-19 తర్వాత ఏ జట్టులో కూడా నాకు చోటు దక్కలేదు. ఐపీఎల్‌లో చెన్నై తరఫున ఆడాక జాతీయ జట్టులో అవకాశం వచ్చింది. చెన్నై తరఫున ఆడటం దేవుడు ఇచ్చిన బహుమతిగా భావిస్తా. సీఎస్‌కేలో ఆడకముందు వరకు నా గురించి ఎవరికీ పెద్దగా తెలియదు. ధోనీతో డ్రెస్సింగ్ రూమ్ పంచుకున్న తర్వాత.. చెన్నై ఆడిన ప్రతీ మ్యాచ్‌లో సత్తా చాటేందుకు ప్రయత్నించా. ఆ తర్వాత గుర్తింపు లభించింది. నాలాంటి కుర్రాళ్లకు ధోనీతో పరిచయం చాలా ప్రత్యేకం' అని పతిరన అన్నాడు. 'నా బౌలింగ్‌ను చూసి చాలా మంది డెత్ ఓవర్లలో అద్భుతంగా వేస్తున్నావని ప్రశంసించారు. కొత్త బంతితో పాటు మిడిల్ ఓవర్లలోనూ మెరుగైన బౌలర్‌గా మారాలి. కొత్త బంతితో స్వింగ్ రాబట్టగలిగితే.. నాకే కాదు నేను ఆడే జట్టుకూ మంచి జరుగుతుంది. ఇందుకోసం తీవ్రంగా ఆలోచించట్లేదు. నిలకడగా ఒకేచోట బంతిని వేయడంపై దృష్టి సారిస్తా. సరైన లెంగ్త్‌తో పాటు స్వింగ్ రాబడితే చాలు. అంతకు మించి నాకేం అవసరం లేదు' అని మతీశా పతిరన చెప్పాడు.

# బ్రియాన్ లారా క్షమాపణలు చెప్పాల్సిందే..



**న్యూఢిల్లీ:** వెస్టిండీస్ మాజీ కెప్టెన్ బ్రియాన్ లారాకు సంబంధించి కొత్త వివాదం తెరపైకి వచ్చింది. ఇద్దరు మాజీ క్రికెటర్లు వివ్ రిచర్డ్స్, కార్ల్ హూపర్‌లపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశాడు. దీంతో బ్రియాన్ లారాకు వ్యతిరేకంగా వివ్ రిచర్డ్స్ విమర్శలు గుప్పించారు. క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. వాస్తవానికి, బ్రియాన్ లారా తను రాసిన పుస్తకం 'లారా, ది ఇంగ్లాండ్ క్రానికల్స్'తో ప్రస్తుతం వార్తల్లో నిలిచారు. ఈ పుస్తకంలో, అతను ఇద్దరు మాజీ వెస్టిండీస్ ఆటగాళ్ళు, వివ్ రిచర్డ్స్, కార్ల్ హూపర్ గురించి కీలక వ్యాఖ్యలు చేశాడు. అయితే ఈ విషయం ఈ ఇద్దరు క్రికెటర్లకు అస్సలు నచ్చలేదు. బ్రియాన్ లారా తన పుస్తకంలో కార్ల్ హూపర్‌పై వివ్ రిచర్డ్స్ చాలా దూకుడుగా ప్రవర్తించాడని, అతనిని వేధించేవాడని ఆరోపించారు. ఇది కాకుండా, రిచర్డ్స్ తనను 3 వారాలకు ఒకసారి వేధించేవాడని లారా తెలిపాడు. ఈ మేరకు లారా తన పుస్తకంలో రాసుకొచ్చాడు. వివ్ రిచర్డ్స్ ప్రతి మూడు వారాలకు నన్ను ఏడిపించేవాడు. ప్రతి వారం కార్ల్ హాపర్‌ని ఏడిపించేవాడు. వివ్ రిచర్డ్స్ స్వరం చాలా భయానకంగా ఉంటుంది. మీరు మానసికంగా దృఢంగా లేకుంటే, మీరు దానిని మీరే తీసుకోలేరు. అది నాపై ఎప్పుడూ ప్రభావం చూపనప్పటికీ. నేను ఈ విషయాన్ని స్వాగతించాను. కానీ, కార్ల్ హాప్పర్ మాత్రం వివ్ రిచర్డ్స్‌కు దూరంగా ఉన్నాడు వివ్ రిచర్డ్స్ ఈ ఆరోపణలతో లారాపై కోపంగా ఉన్నారు. వెంటనే తన ప్రకటనపై క్షమాపణ చెప్పాలని బ్రియాన్ లారాను కోరాడు. కార్ల్ హాప్పర్ పట్ల సర్ వివియన్ రిచర్డ్స్ దూకుడుగా ప్రవర్తించాడని చెప్పడం పచ్చి అబద్ధం. ఈ ప్రకటనలు వివ్ రిచర్డ్స్‌ను నేరస్థుడిగా చూపిస్తున్నాయి. బ్రియాన్ లారా ఈ వాదన పూర్తిగా నిరాధారమైనది. అతని ప్రకటనతో ఇద్దరం తీవ్రంగా గాయపడ్డాం. బ్రియాన్ లారా తన ప్రకటనలను బహిరంగంగా ఉపసంహరించుకోవాలని, హృదయపూర్వకంగా క్షమాపణ చెప్పాలని మా డిమాండ్ చేశారు.

# పాక్‌తో శ్రీలంక ఢీ




**దంబుల్లా:** ఆసియా కప్ రెండో సెమీ ఫైనల్ సమరానికి పాకిస్థాన్, శ్రీలంక జట్లు సిద్ధమయ్యాయి. గ్రూప్-బీలో శ్రీలంక ఆడిన మూడు మ్యాచుల్లోనూ ఘన విజయం సాధించి సెమీ-స్‌కు చేరుకుంది. పాకిస్థాన్ యుఎఇ, నేపాల్ జట్లను ఓడించి నాకౌట్‌కు చేరుకుంది. భారత్ చేతిలో ఓడిన పాకిస్థాన్ తర్వాత ఆడిన రెండు మ్యాచుల్లోనూ భారీ విజయాలను అందుకుంది. శ్రీలంకతో జరిగే మ్యాచ్‌కు ఆత్మవిశ్వాసంతో సిద్ధమైంది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో పాకిస్థాన్ సమతూకంగా కనిపిస్తోంది. ఓపెనర్లు గుల్ ఫెరోజా, మునీబా అలీ, తుబా హసన్, సిద్రా అమీన్, నిదా దర్, ఆలియా రియాజ్ వంటి మ్యాచ్ విన్నర్ బ్యాటర్లు పాకిస్థాన్‌కు అందుబాటులో ఉన్నారు. ఎలాంటి బౌలింగ్‌నైనా చిన్నాభిన్నం చేసే సత్తా ఈ బ్యాటర్లకు ఉంది. దీంతో శ్రీలంకతో జరిగే మ్యాచ్‌లో పాకిస్థాన్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. యుఎఇతో జరిగిన కిందటి మ్యాచ్‌లో పాకిస్థాన్ పది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. దీంతో పాక్ ఆత్మవిశ్వాసం రెట్టింపు అయ్యింది. మరోవైపు ఆతిథ్య శ్రీలంక టీమ్‌ను కూడా తక్కువ అంచనా వేయలేం. సొంత గడ్డపై జరుగుతున్న ఆసియా కప్‌లో లంక అసాధారణ ఆటతో అదరగొడుతోంది. కెప్టెన్ చమరి ఆటపట్టు అద్భుత ఫామ్‌లో ఉంది. ఇప్పటికే ఓ సెంచరీతో అదరగొట్టింది. తాజాగా థాయిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లోనూ కీలక ఇన్నింగ్స్‌తో అలరించింది. హర్షిత, హసిని పెరీరా, అనుష్క, కవిషా దిల్హాన్, నీలాక్షి డి సిల్వా, సుగందిక తదితరులతో శ్రీలంక చాలా బలంగా ఉంది. స్వదేశంలో ఆడుతుండడం లంకకు మరింత కలిసి వచ్చే అంశంగా చెప్పాలి. రెండు జట్లలోనూ ప్రతిభావంతులైన ఆటగాళ్లు ఉండడంతో సెమీస్ సమరం ఆసక్తికరంగా సాగడం ఖాయం.

Printed, Published and Owned by Adula Thirupathi, Printed at Ramani Web Offset Printers, H.No 8-82/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, Published from 2-5-23, Mudhiraj street, Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. **Editor: Adula Thirupathi.** Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277. RNI NO: TELTEL/2023/87657